Bhavani Publication Trust https://prajatheerpudaily.com

# ప్రజాతీర్పు

The people's Verdict

తెలుగు జాతీయ దినపత్రిక




సంపుటి : 25 | సంచిక : 166 | హైదరాబాద్ | ఆదివారం 22 జూన్ 2025 | పేజీలు : 8 | వెల : రూ. 1/-

Cerculated From : KARIMNGAR, HYDERABAD, WARAGAL, RANGAREDDY, MAHABOOBNAGAR, THIRUPATI, GUNTUR, KURNOOL, ANATAPUR, VISAKAPATNAM, CHENNAI, BANGALOOOR



## విజయవంతమైన స్టార్టప్ రాష్ట్రం తెలంగాణ

### ప్రపంచానికి ఇండియానే భవిష్యత్తు

### ఆక్స్‌ఫర్డ్ ఇండియా ఫోరం సదస్సులో కేటీఆర్

ప్రజాతీర్పు ప్రతినిధి, హైదరాబాద్

దేశ చరిత్రలోనే విజయవంతమైన స్టార్టప్ రాష్ట్రం తెలంగాణ అని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ చెప్పారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకం, అతిపెద్ద ఇన్నోవేషన్ క్యాంపస్, ఐదు అతిపెద్ద టెక్ కంపెనీల కార్యాలయాలు తెలంగాణలోనే ఉన్నాయని పేర్కొన్నారు. లండన్‌లో శనివారం జరిగిన ఆక్స్‌ఫర్డ్ ఇండియా ఫోరం సదస్సులో ఆయన మాట్లాడుతూ "కోటి ఇళ్లకు శుద్ధిచేసిన తాగునీటిని అందించిన ఏకైక రాష్ట్రం భారతదేశంలో తెలంగాణ ఒక్కటే. అతిపెద్ద ఎత్తిపోతల పథకం కాళేశ్వరం కేవలం నాలుగేళ్లలోనే పూర్తి చేశాం. అమెరికా అవతల హైదరాబాద్‌లోనే అమెజాన్ అతిపెద్ద క్యాంపస్ ఉంది. ప్రపంచంలోని మూడో వంతు వ్యాక్సిన్ల ఉత్పత్తి తెలంగాణలో జరుగుతుంది. రాష్ట్రం ఏర్పడక ముందు ఒక పరిశ్రమ ఏర్పాటు చేయాలంటే అనుమతుల కోసం ఎన్ని రోజులు పడుతుందో ఎవరూ చెప్పలేని పరిస్థితి ఉండేది. కానీ భారాస అధికారంలోకి వచ్చిన తర్వాత 15 రోజుల్లో అనుమతులు వచ్చేలా చేశాం. వ్యక్తుల కంటే విధానాలకే మేం ప్రాధాన్యమిచ్చాం. 70 లక్షల మంది రైతుల ఖాతాల్లో దాదాపు రూ.75వేల కోట్లు జమచేసిన రాష్ట్రం ప్రపంచంలోనే ఎక్కడా లేదు. మేం తీసుకొచ్చిన ఈ పథకంతో 2014లో ధాన్యం ఉత్పత్తిలో 14వ స్థానంలో ఉన్న తెలంగాణ పంజాబ్, హరియాణాలను దాటి 2022 నాటికి అగ్రస్థానానికి చేరింది. కేసీఆర్ హయాంలో ఫ్లోరోసిస్‌ను పూర్తిగా నిర్మూలించాం. హైదరాబాద్ లాంటి నగరానికి నీటి సమస్యలు లేకుండా శాశ్వత పరిష్కారాన్ని కేసీఆర్ చూపించారు. అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థకు ప్రతినిధిగా మీ భాగస్వామ్యం కోసం వచ్చాను. తెలంగాణకు అద్భుతమైన భవిష్యత్తు ఉందని బలంగా నమ్ముతున్నాను. ఈ ప్రపంచానికి ఇండియానే భవిష్యత్తు. తెలంగాణ తన విజయ ప్రస్థానాన్ని కొనసాగిస్తూనే ఉంటుంది" అని చెప్పారు.



# ఆరోగ్యానికి యోగాద్భుతం

### ప్రపంచానికే స్వస్థత కేంద్రంగా భారత్


- ఆధునిక పరిశోధనలతో యోగాను పరిపుష్టం చేస్తున్నాం
- వైద్యం కోసం మన దేశం వచ్చేవారికి ప్రత్యేక ఈ-ఆయుష్ వీసాలు
- స్థూలకాయం ప్రపంచానికి అతి పెద్ద సవాలు.. దాన్ని అధిగమించాలి
- విశాఖలో అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రధాని మోదీ
- కార్యక్రమాన్ని అత్యద్భుతంగా నిర్వహించారని చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లకు అభినందనలు
- మంత్రి లోకేశ్‌పై ప్రధాని ప్రత్యేక ప్రశంసలు



ప్రజాతీర్పు ప్రతినిధి, విశాఖపట్నం

భారత్‌కు వెళ్లి స్వస్థత చేకూర్చుకో (హీల్ ఇన్ ఇండియా) అన్న భావన ఇప్పుడు ప్రపంచంలో విస్తృత ప్రాచుర్యం పొందుతోందని, అనారోగ్యంతో ఉన్నవారికి స్వస్థత చేకూర్చే అతిపెద్ద కేంద్రంగా భారత్ అవతరిస్తోందని ప్రధాని నరేంద్రమోదీ పేర్కొన్నారు. ఈ పరిణామంలో యోగా కీలకపాత్ర పోషిస్తోందన్నారు. స్వస్థత

- మిగతా 2వ పేజీలో



## 18 వేల సహ పిటిషన్లు పెండింగులో

### కొత్త కమిషనర్ల నియామకంతో కదలిక

- సమాచార కమిషన్‌లో విచారణలు ప్రారంభం
- ప్రభుత్వశాఖలు నిబంధనలు పాటించేలా చూడాలని ప్రభుత్వానికి కమిషన్ లేఖ

ప్రజాతీర్పు ప్రతినిధి, హైదరాబాద్

రాష్ట్ర సమాచార కమిషన్ మళ్లీ క్రియాశీలకమైంది. 2023 ఫిబ్రవరి నుంచి సమాచార కమిషనర్లను నియమించ కపోవడంతో 18 వేలకుపైగా అప్పీళ్లు, ఫిర్యాదులు విచారణకు ఎదురుచూస్తున్నాయి. ఇటీవల నూతన సమాచార కమిషనర్ల నియామకాలతో మళ్లీ విచారణలు ప్రారంభ మయ్యాయి. సమాచార హక్కు (సహ) చట్టం అమలుకు ప్రతి ప్రభుత్వశాఖలో తీసుకున్న చర్యలు, ప్రజల దరఖాస్తులకు ఇచ్చిన సమాచారం వివరాలతో ప్రతి 3 నెలలకు, సంవత్సరానికి నివేదికలను కమిషన్‌కు అందజేయాలి. ఈ నిబంధనలను పలు శాఖలు పట్టించుకోవడం లేదని, విధిగా అందరు శాఖాధిపతులు అమలుచేసేలా ఉత్తర్వులు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి సమాచార కమిషన్ లేఖ రాసింది.

ఏటా అన్ని శాఖల సమాచారంతో 'వార్షిక నివేదిక' రూపొందించి ప్రభుత్వానికి కమిషన్ అందజేస్తుంది. దీన్ని శాసనసభలో ప్రవేశపెట్టి ప్రజల ముందుంచాలి. కానీ 2015 నుంచి 2023 వరకు 9 వార్షిక నివేదికలను శాసనసభలో ప్రవేశపెట్టకుండా పక్కన పడేశారని కమిషన్ ప్రభుత్వానికి తెలిపింది. కమిషన్ తాజాగా 2024 వార్షిక నివేదిక రూపొందిస్తోంది. చట్టప్రకారం ఈ నివేదికను శాసనసభలో ప్రవేశపెట్టాలని కమిషన్ ప్రభుత్వానికి సూచించింది. మొత్తం 12 వేలకు పైగా తుది అప్పీళ్లు పెండింగులో ఉన్నాయి. ఇవికాకుండా కమిషన్ చెప్పినా పట్టించు కోలేదని, ప్రభుత్వ కార్యాలయాలపై

- మిగతా 2వ పేజీలో

# రూ.3,000 కోట్లు... 500 మెగావాట్లు!

### పీఎస్‌పీ నిర్మాణానికి సింగరేణి అడుగులు

### మేడిపల్లిలో మూతపడిన బొగ్గుగనిలో పైలట్ ప్రాజెక్టు

### వ్యాప్కోస్‌కు డీపీఆర్ తయారీ బాధ్యత



ప్రజాతీర్పు ప్రతినిధి, హైదరాబాద్

వ్యాపార విస్తరణలో భాగంగా ఇప్పటికే థర్మల్, సౌరవిద్యుత్ ప్లాంట్లను నెలకొల్పిన సింగరేణి సంస్థ తాజాగా పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్లాంట్(పీఎస్‌పీ)ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు రామగుండం వద్ద మూతబడిన మేడిపల్లి ఉపరితల గని(ఓపెన్‌కాస్ట్-ఓసీ)లో సుమారు రూ.3,000 కోట్లతో 500 మెగావాట్ల సామర్థ్యంతో పీఎస్‌పీని నిర్మించనుంది. సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)ను రూపొందించే బాధ్యతను ప్రభుత్వ రంగ సంస్థ వ్యాప్కోస్‌కు అప్పగించింది. జియోలాజికల్, జియో

- మిగతా 2వ పేజీలో

## ఇదీ బజార్ వైద్య ఆరోగ్య శాఖలో యోగ కార్యక్రమాలు

(ప్రజాతీర్పు ప్రతినిధి : హైదరాబాద్ )

అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్బంగా చార్మినార్ డివిజన్ పరిధిలో ఈడీ బజార్ వైద్య ఆరోగ్య శాఖలో యోగ కార్యక్రమాలు నిర్వహించారు యోగ ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రాణాయామం, యోగ ఆసనాలు వేయడం వల్ల శారీరక ఆరోగ్యం పొందగల్గుతారని ప్రతి రోజు క్రమం తప్పకుండ యోగ చేయాలని నిర్ణయించుకున్నారు, వివిధ యోగాసనలతో యోగడే నిర్వహించారు ఈ కార్యక్రమం లో పి హెచ్ ఎన్ వి పద్మశ్రీ, ఏఎన్ఎమ్స్ పుష్ప ప్రమీల సలోమి రమ్య మరియు ల్యాబ్ టెక్నీషియన్ దేవి స్టాఫ్నర్స్ బుజ్జి పలువురు ఆశా కార్యకర్తలు అస్పత్రి సిబ్బంది పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసారు





## రైతుభరోసా జమ చేయకుంటే.. ఓఆర్ఆర్‌ను దిగ్బంధిస్తాం

### కోర్టులు మొట్టికాయలు వేసినా ప్రభుత్వ తీరు మారట్లే

### మాజీ మంత్రి హరీశ్‌రావు

ప్రజాతీర్పు ప్రతినిధి, జిన్నారం

రైతుభరోసా జమకాని రెండు లక్షల మంది అన్నదాతలతో ఔటర్ రింగ్ రోడ్డు(ఓఆర్ ఆర్)ను దిగ్బంధిస్తామని మాజీ మంత్రి, భారాస సీనియర్ నేత హరీశ్‌రావు

- మిగతా 2వ పేజీలో



## ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి అరెస్టు, విడుదల

### శంషాబాద్ ఎయిర్‌పోర్టులో అదుపులోకి

- గ్రానైట్ వ్యాపారిని బెదిరించిన కేసులో అరెస్ట్
- సొంత పూచీపై విడుదల చేసిన కాజీపేట కోర్టు
- నాపై కేసులు పెడితే ఏకే 47లా వస్తా
- సీఎంకు అన్ని పనుల్లో 20 శాతం కమీషన్లు
- మంత్రి సీతక్క ఇసుక దందా, కడియం కబ్జాలు

2

గ్రానైట్ వ్యాపారిని బెదిరించిన కేసులో హుజూరాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని హనుమకొండలోని సుబేదారి పోలీసులు అరెస్టు చేశారు. ఎమ్మెల్యే దుబాయ్ వెళ్తున్నారని సమాచారం అందుకున్న పోలీసులు శనివారం తెల్లవారుజామున శంషాబాద్ ఎయిర్‌పోర్టులో అదుపులోకి తీసుకున్నారు.

# ఆరోగ్యానికి యోగాద్భుతం

(మొదటి పేజీ తరువాయి)

కోసం వచ్చేవారికి ప్రత్యేక ఈ-ఆయుష్ వీసాలు జారీచేస్తామని ఆయన ప్రకటించారు. 11వ ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా శనివారం ఉదయం విశాఖపట్నంలోని ఆర్కే బీచ్ నుంచి భోగాపురం వరకు లక్షలమందితో రాష్ట్రప్రభుత్వం నిర్వహించిన ప్రపంచ యోగా దినోత్సవంలో ప్రధాని ప్రసంగించారు. ఇందులో పాల్గొనే అవకాశం లభించినందుకు సంతోషం వ్యక్తంచేశారు. విశాఖను అభివృద్ధి, రమణీయ ప్రకృతి సౌందర్యాల మేలు కలయికగా ఆయన అభివర్ణించారు. యోగా దినోత్సవాన్ని అత్యంత విజయవంతం చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లకు, ప్రభుత్వ యంత్రాంగానికి ఆయన ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. వారి నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ యోగాంధ్ర కార్యక్రమాన్ని అత్యద్భుతంగా నిర్వహించిందని కొనియాడారు. రాష్ట్రంలో రెండు కోట్లకుపైగా ప్రజలు పాల్గొనడం... వారిలో ఉరకలెత్తే ఉత్సాహానికి నిదర్శనమన్నారు. వికసిత్ భారత్ లక్ష్యసాధనకు ఇలాంటి స్ఫూర్తే బలమైన పునాదిగా ఆయన పేర్కొన్నారు. "పౌరులు వారంతటవారే ఓనర్‌షిప్ తీసుకుని, చురుగ్గా పాలుపంచుకుంటే ఎంత కఠినమైన లక్ష్యమైనా అసాధ్యం కాదు. విశాఖపట్నంలో జరిగిన కార్యక్రమంలో ఆద్యంతం ప్రజల ఉత్సాహం, సుహృద్భావం ప్రబలంగా కనిపించాయి" అని మోదీ పేర్కొన్నారు.

కల్లోల పరిస్థితుల్లో శాంతిమార్గం యోగా"యోగాను ఒక ప్రజా ఉద్యమంగా మార్చడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి. అది ఈ ప్రపంచాన్ని శాంతి, ఆరోగ్యం, సామరస్యం దిశగా నడిపిస్తుంది. ప్రతి ఒక్కరూ తమ జీవితంలో సమతుల్యం సాధించేందుకు యోగాతో దినచర్య ప్రారంభించాలి. ఒకే భూమి, ఒకే ఆరోగ్యం అన్న నినాదం ప్రపంచ తీర్మానం కావాలి" అని ప్రధాని ఆకాంక్షించారు. ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో పెరుగుతున్న అశాంతి, అస్థిరతపై ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. అలాంటి కల్లోల పరిస్థితుల్లో యోగా శాంతికి మార్గం చూపిస్తుందన్నారు. "మానవ సమాజానికి యోగా ఒక 'పాజ్ బటన్'. ఒక్కసారి ఆగి ఊపిరి పీల్చుకునేందుకు, సంతులనం చేసుకునేందుకు, మళ్లీ మామూలు మనుషులయ్యేందుకు ఇది తోడ్పడుతుంది. అంతర్గత శాంతిని ప్రపంచవిధానంగా మార్చే... 'మానవాళి-2.0 కోసం యోగా' అన్న సంకల్పానికి ఈ యోగా దినోత్సవం నాందీ ప్రస్తావనగా నిలవాలి. యోగా అనేది వ్యక్తిగత అభ్యసనానికే పరిమితం కాకూడదు, అది ప్రపంచ భాగస్వామ్యానికి ఒక మాధ్యమంగా మారాలి" అని ఆకాంక్షించారు. ప్రపంచంలోని ప్రతి దేశం తమ పబ్లిక్ పాలసీల్లో యోగాను అంతర్భాగం చేసుకోవాలని ఆయన సూచించారు. యోగాతో ఆరోగ్యం అన్న నినాదాన్ని దేశవ్యాప్తంగా ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంతో జాతీయ ఆయుష్ మిషన్ కృతకృత్యమైందని మోదీ తెలిపారు. ఈ విషయంలో సాంకేతికత కీలక భూమిక పోషించిందన్నారు. యోగా పోర్టల్, యోగాంధ్ర వెబ్‌సైట్‌ల ద్వారా అంతర్జాతీయ యోగా దినోత్సవానికి 10 లక్షలకుపైగా కార్యక్రమాల రిజిస్ట్రేషన్ జరిగిందని, దేశంలోని ప్రతి మూలకూ యోగా స్ఫూర్తి చేరిందనడానికి ఇదే నిదర్శనమని పేర్కొన్నారు. అందరికీ అవసరమైన కొన్ని ప్రక్రియల్ని ఏర్చికూర్చి 'కామన్ యోగా ప్రొటోకాల్' పేరుతో ప్రామాణిక విధానాన్ని రూపొందిస్తామని తెలిపారు. యోగా సర్టిఫికేషన్ బోర్డు 6.5 లక్షల మంది వాలంటీర్లకు శిక్షణ ఇచ్చిందని, 130 సంస్థల్ని గుర్తించిందని తెలిపారు. వైద్యకళాశాలల్లో పదిరోజుల యోగా శిక్షణ మాడ్యూల్‌ని చేర్చినట్టు పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఆయుష్మాన్ ఆరోగ్యకేంద్రాల్లో శిక్షణ కార్యక్రమాల ద్వారా యోగా టీచర్లను సిద్ధం చేసినట్టు తెలిపారు.

యోగాభ్యాసం వల్ల చేకూరే ప్రయోజనాల్ని ప్రపంచం నలుమూలలకూ వ్యాప్తి చేసేందుకు ఆధునిక పరిశోధనల ద్వారా యోగశాస్త్రాన్ని మరింత పరిపుష్టం చేస్తున్నట్టు ఆయన తెలిపారు. దేశంలోని ప్రముఖ వైద్య విజ్ఞానసంస్థలు యోగాపై పరిశోధనల్లో పాలుపంచుకుంటున్నాయని, ఆధునిక వైద్య విధానాల్లో యోగాకున్న ప్రాధాన్యాన్ని శాస్త్రీయంగా నిరూపించేందుకు కృషిచేస్తున్నాయని తెలిపారు. యోగా ఫలితాలకు ఆధారాలను నిరూపించడంలో దిల్లీ ఎయిమ్స్ చేసిన కృషిని ఆయన ప్రశంసించారు. హృద్రోగాలు, నాడీవ్యాధులు, మహిళల అనారోగ్య సమస్యల్ని నయం చేయడంలో, మానసిక శాంతిని చేకూర్చడంలో యోగా ప్రభావవంతంగా పనిచేస్తుందన్న విషయాన్ని ఎయిమ్స్ రుజువు చేసిందని ప్రధాని పేర్కొన్నారు.

### ఆ మూడూ చేస్తే ఆరోగ్యం మీ చెంతే

"స్థూలకాయం ప్రపంచానికి అతిపెద్ద సవాలు. దాన్నుంచి బయటపడేందుకు... ప్రతి ఒక్కరూ వారి రోజువారీ ఆహారంలో వంటనూనెల వినియోగాన్ని 10% తగ్గించాలి. మన దేశ ప్రజలతో పాటు, ప్రపంచవ్యాప్తంగా ఉన్నవారంతా ఈ సవాలును స్వీకరించాలి. దీనిపై ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలి. వంటనూనెల వాడకం తగ్గించడం, అనారోగ్యకర ఆహారం జోలికి వెళ్లకపోవడం, క్రమం తప్పకుండా యోగా చేయడం ఆరోగ్యకర జీవనానికి సోపానాలు" అని ప్రధాని పేర్కొన్నారు.

### మనం అన్న భావనతోనే సంక్షేమం

"ఒకే భూమి, ఒకే ఆరోగ్యం కోసం యోగా- అన్న ఈ సంవత్సరం అంతర్జాతీయ యోగా దినోత్సవం థీమ్‌కి విస్తృతార్థం ఉంది. ఈ భూమండలంపై ప్రతి దాని ఆరోగ్యం మరో దాంతో ముడిపడి ఉందన్న సత్యాన్ని అది బోధిస్తుంది. మనుషుల ఆరోగ్యం మనకు ఆహారాన్నందించే నేల, నీటిని అందించే నదులు, మన పర్యావరణ వ్యవస్థలో కీలకభూమిక పోషించే జంతువులు, మనకు అన్నివిధాలా మేలుచేసే మొక్కల ఆరోగ్యంపై ఆధారపడి ఉంది. యోగా అనేది మనల్ని ఈ పరస్పరాధారిత వ్యవస్థ గురించి జాగరూకుల్ని చేసి, ప్రపంచంతో ఏకత్వభావనతో ముందుకు సాగేలా మార్గదర్శనం చేస్తుంది. మొదట్లో మనం మన ఆరోగ్యం, సంక్షేమం గురించి పట్టించుకుంటాం. క్రమంగా పర్యావరణం, సమాజం, చివరకు ఈ భూమండలాన్ని రక్షించుకోవాలన్న స్పృహకు విస్తరిస్తుంది. యోగా అనేది అకుంఠితమైన వ్యక్తిగత క్రమశిక్షణకు, వ్యక్తులు నేను అన్న భావన నుంచి మనం అన్న భావన దిశగా పరిణామం చెందేందుకు దోహదం చేస్తుంది. ఇలా మారడమే నిజమైన భారతీయ ఆత్మకు ప్రతీక. 'సర్వేభవంతు సుఖిన' అంటూ భారతీయ సంస్కృతి మనకు బోధించే తత్వం సారాంశం అదే. మానవాళి సంక్షేమం కోరుకోవడం ప్రతి ఒక్కరి పవిత్ర కర్తవ్యం" అని ఆయన తెలిపారు.

### భాయి లోకేశ్.. శభాష్

విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేశ్‌పై ప్రధాని ప్రశంసల వర్షం కురిపించారు. ఒకటికి రెండుసార్లు 'భాయి లోకేశ్' అని ప్రస్తావిస్తూ... యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయడంలో లోకేశ్ కృషిని ప్రశంసించారు. "యోగా దినోత్సవం లాంటి ఒక కార్యక్రమాన్ని నిజమైన సమాజ ఉత్సవంగా ఎలా మార్చవచ్చో, సమాజంలోని ప్రతి వర్గాన్నీ ఎలా భాగస్వాముల్ని చేయవచ్చో లోకేశ్ చూపించారు" అని కొనియాడారు. గడచిన నెలన్నర రోజులుగా యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు లోకేశ్ అలుపెరగకుండా శ్రమించారని, ఆయన కృషి అభినందనీయమని ప్రధాని కొనియాడారు.

### యోగా వేడుకల్లో పాల్గొనడం అద్భుత అనుభవం

విశాఖపట్నంలో జరిగిన అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొనడం అద్భుతమైన అనుభవమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. "యోగా అంటే వ్యాయామమే కాదు.. అది ఒక జీవన విధానం' అని ఎక్స్‌లో ప్రధాని పోస్టు చేశారు. విశాఖలో యోగా వేడుక వీడియోను పోస్టుకు జతచేశారు

### సిడ్నీ నుంచి ఎవరెస్ట్ వరకూ ఒకటే సందేశం

"యోగా అంటేనే అనుసంధానం అని అర్థం. ప్రపంచం మొత్తాన్ని యోగా ఏకతాటిపైకి తేవడం గొప్ప విషయం. దశాబ్దం క్రితం మొదటిసారి ఐరాసలో అంతర్జాతీయ యోగా దినోత్సవం గురించి భారత్ ప్రతిపాదించినప్పుడు... స్వల్పవ్యవధిలోనే 175 దేశాలు దానికి మద్దతిచ్చాయి. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఒక అంశానికి ఇంత ఐక్యతను కూడగట్టడం ఆషామాషీ కాదు. అది మన ప్రతిపాదనకు లభించిన మద్దతే కాదు... మానవాళి సంక్షేమం కోసం ప్రపంచం మొత్తం ఐక్యంగా చేసిన గొప్ప ప్రయత్నం" అని ప్రధాని పేర్కొన్నారు. "గడిచిన 11 ఏళ్లలో ప్రపంచవ్యాప్తంగా కొన్ని కోట్లమంది జీవన విధానంలో యోగా అంతర్భాగమైంది. దివ్యాంగులు బ్రెయిలీ లిపి ద్వారా యోగశాస్త్రం చదువుతున్నారు. అంతరిక్షంలో శాస్త్రవేత్తలు యోగాభ్యాసం చేస్తున్నారు. గ్రామీణ యువత యోగా ఒలింపియాడ్‌లలో పాల్గొంటున్నారు. సిడ్నీ ఒపెరా హౌస్ మెట్ల నుంచి ఎవరెస్ట్ వరకు... సముద్రాల వరకూ ఒకే సందేశం వినిపిస్తోంది. ప్రతి ఒక్కరి కోసం యోగా... అందరి కోసం యోగా అన్నదే ఆ నినాదం" అని ప్రధాని పేర్కొన్నారు.

# విద్యుత్ శాఖ ఉద్యోగులకు 2% వరకు డీఏ పెంపు

## జనవరి ఒకటి నుంచి అమల్లోకి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



విద్యుత్ రంగంలో దేశానికి తెలంగాణ దిక్సూచిలా పని చేయాలని డిప్యూటీ సీఎం, విద్యుత్‌శాఖ మంత్రి భట్టి విక్రమార్క అన్నారు. విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న మొత్తం 71,417 మంది ఉద్యోగులు, పింఛనుదారులకు ప్రయోజనం చేకూరేలా దాదాపు 2% డీఏ పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆయన ప్రకటించారు. ఈ పెంపు గత జనవరి ఒకటి నుంచి అమల్లోకి వస్తుందన్నారు. ఈ మేరకు శనివారం ప్రజాభవన్లో విద్యుత్ ఉద్యోగ సంఘాల నేతలకు డీఏ పెంపు ఉత్తర్వుల ప్రతిని ఆయన అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఆర్టిజన్లకు కూడా డీఏ పెంపు వర్తిస్తుందన్నారు. ఇప్పటివరకు 14.074 శాతం ఉన్న డీఏను 16.018 శాతానికి పెంచుతూ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఈ పెంపుతో విద్యుత్ సంస్థలపై ప్రతి నెలా రూ.11.193 కోట్ల అదనపు భారం పడుతుందని చెప్పారు. "కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ఏడాది మార్చిలో రోజూవారీ గరిష్ఠ విద్యుత్ డిమాండు 17,162 మెగావాట్లకు పెరిగింది. ఇది గత ప్రభుత్వ కాలంతో పోలిస్తే 2 వేల మెగావాట్లు అదనం. రాష్ట్రంలో 2029-30 నాటికి రోజూవారీ డిమాండు 26,299, 2034-35 నాటికి 33,773 మెగావాట్లకు చేరుతుందని కేంద్ర ప్రభుత్వ సంస్థ నివేదిక ఇచ్చింది. దీనికి అనుగుణంగా ఉత్పత్తి, సరఫరాకు అంచనాలు సిద్ధం చేస్తున్నాం. 2029-30 నాటికి 20 వేల మెగావాట్ల హరిత ఇంధన ఉత్పత్తి లక్ష్యంగా పనిచేస్తున్నాం" అని భట్టి వెల్లడించారు. ఈ సమావేశంలో ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణభాస్కర్, విద్యుత్ ఇంజనీర్స్ సంఘాల నాయకులు రత్నాకర్, శివాజీ, సాయిబాబు, శ్రీధర్, బీసీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి అరెస్టు, విడుదల

## ఎమ్మెల్యే నాగరాజు పోస్టింగ్‌ల దందా
## రేపు వాళ్ల బాగోతాలు బయటపెడతా
## బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలు

ప్రజాతీర్పు ప్రతినిధి, హైదరాబాద్



గత ఏప్రిల్ 21న హనుమకొండలోని ఎన్‌జీవోఎస కాలనీకి చెందిన గ్రానైట్ వ్యాపారి కట్ట మనోజ్‌రెడ్డి భార్య ఉమాదేవి కౌశిక్‌రెడ్డిపై కేసు పెట్టారు. తన భర్తను కౌశిక్‌రెడ్డి రూ.50 లక్షలు ఇవ్వాలని బెదిరించారని, ఎమ్మెల్యేతో తన కుటుంబానికి ప్రాణభయం ఉందని సుబేదారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కౌశిక్‌రెడ్డిపై బీఎన్‌ఎస సెక్షన్లు 308(2), 308(4), 352 కింద కేసు నమోదు చేశారు. తనపై అక్రమ కేసు పెట్టారని, ఏప్రిల్ 27న జరిగే బీఆర్ఎస్ బహిరంగ సభను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారని కౌశిక్‌రెడ్డి హైకోర్టులో క్వాష్ పిటిషన్ వేశారు. దీనిపై విచారించిన హైకోర్టు బీఆర్ఎస్ బహిరంగ సభ అయ్యే వరకు కౌశిక్‌రెడ్డిని అరెస్టు చేయవద్దని, విచారణ కొనసాగించవచ్చని పేర్కొంది. అయితే, శనివారం తెల్లవారుజామున కౌశిక్‌రెడ్డిని అరెస్టు చేసిన పోలీసులు.. సుబేదారి ఠాణా కు తరలించారు. వరంగల్ ఎంజీఎంలో వైద్య పరీక్షలు నిర్వహించి కాజీపేట రైల్వేకోర్టుకు తీసుకెళ్లారు. ఇరుపక్షాల వాదనలు విన్న జడ్జి నాగలీల సుస్మిత వ్యక్తిగత పూచీకత్తుపై కౌశిక్‌రెడ్డికి బెయిల్ మంజూరు చేశారు.

కౌశిక్‌రెడ్డి అరెస్టు హనుమకొండలో ఉద్రిక్తతకు దారి తీసింది. శనివారం ఉదయం 10 గంటలకు కౌశిక్‌రెడ్డిని సుబేదారి ఠాణాకు తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ లీగల్ టీంతో కలిసి పోలీసస్టేషన్‌కు చేరుకున్నారు. కౌశిక్‌రెడ్డితో మాట్లాడేందుకు సీఐ రంజిత్ నిరాకరించడంతో పోలీసులు, బీఆర్ఎస్ శ్రేణుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలోనే హుజూరాబాద్ నుంచి భారీగా బీఆర్ఎస్ శ్రేణులు తరలివచ్చాయి. వినయ్‌భాస్కర్‌తో పాటు పార్టీ కార్యకర్తలు కౌశిక్‌రెడ్డిపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని ఆందోళనకు దిగారు. సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, బీఆర్ఎస్ నేత రాకేశ్ రెడ్డి మధ్యాహ్నం పోలీసస్టేషన్‌కు చేరుకున్నారు. కౌశిక్‌రెడ్డిని వైద్య పరీక్షల నిమిత్తం ఎంజీఎంకు తరలిస్తున్న క్రమంలో గులాబీ శ్రేణులు అడ్డుకునే ప్రయత్నం చేశాయి. దీంతో పోలీసులు, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య తోపులాట జరిగింది.

### కేసులు పెడితే ఏకే 47లా వస్తా: కౌశిక్‌రెడ్డి

"సీఎం రేవంత్‌రెడ్డి ఎన్ని అక్రమ కేసులు పెట్టినా కేసీఆర్ నాయకత్వంలో ఏకే 47లా తయారై వస్తా. సీఎం ప్రతీ పనిలో 20 శాతం కమీషన్లు తీసుకుంటున్నారు. మంత్రి సీతక్క ఇసుక, క్వారీ దందా.. ఎమ్మెల్యే కడియం శ్రీహరి భూ కబ్జాలు.. ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పోలీస్ పోస్టింగ్‌ల దందాలు.. అన్నీ బయటపెడతా.. రేపు తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశం పెట్టి సాక్ష్యాలతో వెల్లడిస్తా" అని ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి అన్నారు. శనివారం రాత్రి కాజీపేట రైల్వే కోర్టులో బెయిల్ వచ్చిన తర్వాత ఆనందంతో కౌశిక్‌రెడ్డి కంట తడిపెట్టారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా చివరికి న్యాయమే గెలిచిందన్నారు. కాగా, కాంగ్రెస్ ప్రభుత్వం పాలనను గాలికొదిలేసి, రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని హరీశ్‌రావు విమర్శించారు. రైతుల నుంచి ప్రజాప్రతినిధుల వరకు అందరినీ కేసులతో వేధిస్తున్నారని ఎక్స్ వేదికగా విమర్శించారు.



# రైతుభరోసా జమ చేయకుంటే.. ఓఆర్ఆర్‌ను దిగ్బంధిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఓఆర్ఆర్‌ను ఆనుకొని ఉన్న మండలాల్లో రైతులకు పెట్టుబడి సాయం అందలేదని.. అర్హులందరికీ నిధులు జమ చేయకుంటే మహేశ్వరం, మేడ్చల్ ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, మల్లారెడ్డి వంటి భారాస నేతల సహకారంతో దిగ్బంధ కార్యక్రమం చేపడతామన్నారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన 20వేల మందికి రైతుభరోసా జమకాలేదంటూ శనివారం జిన్నారంలోని అంబేడ్కర్ కూడలిలో నిర్వహించిన రైతు మహాధర్నాకు హరీశ్‌రావు హాజరై మాట్లాడారు. 'ముఖ్యమంత్రి పటాన్‌చెరు నియోజకవర్గంపై పగపట్టడంలో అర్థం లేదు. ఆయన ఎనుమల రేవంత్‌రెడ్డి కాదు.. కోతల రేవంత్‌రెడ్డి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైతులకు భరోసా ఇస్తామంటూ పటాన్‌చెరు, మేడ్చల్ నియోజకవర్గాల అన్నదాతలకు మొండిచేయి చూపడం సరికాదు. కొవిడ్ సమయంలో తీవ్ర ఆర్థిక కష్టాలున్నా.. రైతులకు కేసీఆర్ అండగా నిలిచారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఓట్లు వచ్చినప్పుడే రైతుభరోసా నిధులు జమచేస్తున్న విషయాన్ని ప్రజలు గమనించాలి.

### కేసులు పెట్టినా.. ప్రజల పక్షాన పోరాడతాం

గతంలో నేను మానకొండూరులో జరిగిన సమావేశంలో ఎగవేతల రేవంత్‌రెడ్డి అంటే కేసు పెట్టారు. ఇప్పుడు కోతల రేవంత్ అంటే అదేపని చేస్తారేమో. ఎన్ని కేసులు పెట్టినా, నిర్బంధాలు, అక్రమ అరెస్ట్‌లు చేసినా.. రైతులు, ప్రజల పక్షాన పోరాటం చేస్తాం. కోర్టులు మొట్టికాయలు వేసినా ప్రభుత్వం తీరు మారడం లేదు. హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిని అక్రమంగా అరెస్ట్ చేశారు. దేశంలోని పలు రాష్ట్రాలతో పోటీ పడి ఫార్ములా-ఈ రేస్ పోటీలు నిర్వహిస్తే మాజీ మంత్రి కేటీఆర్‌పై కేసు పెట్టారు. ఎవరూ ఇష్టపడని అందాల పోటీలు నిర్వహించి పరువు తీశారు. సీఎం అనుచరులు ఇద్దరు మిస్ ఇంగ్లాండ్‌తో అనుచితంగా వ్యవహరించారు. ఇందుకు ముగ్గురు అధికారులతో కమిటీ వేయడమే నిదర్శనం' అని హరీశ్‌రావు పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు '2028లో రప్పా రప్పా 3.0 లోడింగ్' అంటూ ప్రదర్శించిన ఫ్లెక్సీలు చర్చనీయాంశమయ్యాయి. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు సునీతాలక్ష్మారెడ్డి, చింతా ప్రభాకర్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, మాణిక్‌రావు, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్, ఆదర్శ్‌రెడ్డి పాల్గొన్నారు.



# రూ.3,000 కోట్లు... 500 మెగావాట్లు!

(మొదటి పేజీ తరువాయి)

టెక్నికల్, హైడ్రాలజీ అధ్యయనాలతోపాటు సివిల్ డిజైన్లు, ఉత్పత్తి సామర్థ్య అంశాలు, మెకానికల్, విద్యుత్ డిజైన్లు, పర్యావరణ, రక్షణ చర్యలపై అధ్యయనాలు చేశాక వ్యాప్కోస్ డీపీఆర్ సిద్ధం చేస్తుంది. ప్లాంట్ నిర్మాణానికి పట్టే సమయం, వ్యయం, ఇక్కడ ఉత్పత్తి అయ్యే విద్యుత్ అమ్మకాలకున్న అవకాశాలనూ అందులో వివరిస్తుంది.

పీఎస్‌పీ... జల విద్యుదుత్పత్తి కేంద్రం మాదిరిగానే పనిచేస్తుంది. కృష్ణా నదిపై నిర్మించిన శ్రీశైలం జల విద్యుత్కేంద్రంలో వరదనీటి ప్రవాహ ఉద్ధృతికి టర్బైన్లు తిరగడంతో కరెంటు ఉత్పత్తవుతుంది. పీఎస్‌పీలో... నది లేని ప్రాంతంలో రెండు రిజర్వాయర్లు నిర్మిస్తారు. అడుగున ఉన్న రిజర్వాయర్ నుంచి ఎత్తయిన ప్రదేశంలో ఉన్న మరో రిజర్వాయర్‌లోకి నీటిని పంపింగ్ చేస్తారు. తర్వాత అందులో నుంచి నీటిని తిరిగి కిందికి వదలడం ద్వారా టర్బైన్లను నడిపి విద్యుదుత్పత్తి చేస్తారు. ప్రస్తుతం మేడిపల్లి ఉపరితల గనిలో 157 మీటర్ల లోతున ఏడాది పొడుగునా భారీ పరిమాణంలో వర్షపు నీరు నిల్వ ఉంటోంది. బొగ్గు గని ఉపరితలంపై 9.64 మిలియన్ క్యూబిక్ మీటర్ల పరిమాణంలో నీటి నిల్వ కోసం సుమారు 2,350 మీటర్ల పొడవు, 23 మీటర్ల లోతులో కొత్త రిజర్వాయర్‌ను నిర్మిస్తారు. గనిలో ఉన్న నీటిని ఉపరితలంపై నిర్మించే రిజర్వాయర్‌లోకి పగటిపూట తక్కువ ధరలకు లభించే సౌరవిద్యుత్ వినియోగించి మోటార్లతో ఎత్తిపోస్తారు. తర్వాత... రాత్రిపూట అదే నీటిని కిందనున్న ఉపరితల గని రిజర్వాయర్‌లోకి మళ్లీ వదులుతారు. ఈ నీరు కిందకు అధిక వేగంతో వచ్చే సమయంలో టర్బైన్లను నడిపితే విద్యుదుత్పత్తి జరుగుతుంది. కింద ఉన్న నీటిని పైకి ఎత్తిపోయడం(పంపింగ్), అక్కడ నిలువ చేసిన నీటిని తిరిగి కిందికి వదలడం ద్వారా విద్యుదుత్పత్తి చేస్తున్నందున దీనిని పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు అని పిలుస్తున్నారు. మొత్తంగా... పగటిపూట మిగులుగా ఉన్న సౌరవిద్యుత్‌ను వాడుకుని, తిరిగి రాత్రిపూట కరెంటును ఉత్పత్తి చేసి రాష్ట్రానికి తక్కువ ధరకే ఇవ్వాలనేది ఈ ప్రాజెక్టు లక్ష్యం. అప్పుడు బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలకు కరెంటు కొనాల్సిన అసరమూ ఉండదు. దీంతో రాష్ట్ర డిస్కంలపై ఆర్థికభారం తగ్గుతుంది.

# 18 వేల సహ పిటిషన్లు పెండింగులో

(మొదటి పేజీ తరువాయి)

ఫిర్యాదు లు మరో 6 వేలు కమిషన్‌లో విచారణకు ఎదురుచూస్తున్నాయి. ఈ అప్పీళ్లు, ఫిర్యాదు లపై రాష్ట్ర సమాచార కమిషన్ కార్యాల యంలో కమిషనర్లు విచారణ చేసే సమయంలో సంబంధిత కార్యాలయ పీఐవో లేదా ఎఫ్ఏఏ తప్పనిసరిగా రావాలి. కానీ వీరు రాకుండా ఎవరో ఒక ఉద్యోగిని మొక్కుబడిగా పంపుతున్నారని.. ఇలాంటివారిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్)కి లేఖ రాసినట్లు రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ చంద్రశేఖరరెడ్డి 'ఈనాడు'కు తెలిపారు. సహ చట్టం అమలులో నిర్లక్ష్యం చూపే పీఐవోలు, ఎఫ్ఏఏలను ఉపేక్షించేది లేదని ఆయనతో పాటు సమాచార కమిషనర్లు అయోధ్యరెడ్డి, పీబీ శ్రీనివాస్ తెలిపారు.

# బీజేపీ నర్సంపేట పట్టణం నర్సంపేట మండల వికసిత్ భారత్ మండల సంకల్ప సభ

**ముఖ్య అతిథి డాక్టర్ రానా ప్రతాప్ రెడ్డి**

**నర్సంపేట జూన్ 21 (ప్రజా తీర్పు)**



భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ఏర్పడి దేశ ప్రధాని నరేంద్ర మోడీ 11 సంవత్సరాల సేవా - సుపరిపాలన పూర్తి చేసుకున్న సందర్భంగా బిజెపి ప్రభుత్వం తీసుకున్న చారిత్రాత్మకమైన నిర్ణయాలను ప్రభుత్వ పథకాలను ప్రజలకు తెలియజేసేలా నర్సంపేట పట్టణం నర్సంపేట మండలం భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షులు గూడూరు సందీప్,నర్సంపేట మండల అధ్యక్షులు తనుగుల అంబేద్కర్ అధ్యక్షతన నిర్వహించిన రచ్చబండ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా బీజేపీ వరంగల్ జిల్లా ప్రధానకార్యదర్శి, నర్సంపేట నియోజకవర్గ నాయకులు డా.ఎం గోగుల రాణా ప్రతాప్రెడ్డి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా రాణా ప్రతాప్ రెడ్డి మాట్లడుతూ.. భారత ప్రధాని నరేంద్ర మోడీ గారు అధికారం చేపట్టి 11 సంవత్సరాలు వికసిత్ భారత్ అమృతకాలం సేవా - పరిపాలన, సుపరిపాలన సందర్భంగా దేశ ప్రధాని తీసుకున్నటువంటి చారిత్రాత్మకమైన నిర్ణయాలను మరియు పథకాలను ప్రజలకు చేరవేసే విధంగా రచ్చబండ కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు విస్తృత ప్రచారం చేస్తూ, అదేవిధంగా రాబోయే స్థానిక ఎలక్షన్లకు సిద్ధంగా ఉండాలి ప్రతి బూత్ అధ్యక్షులు ఒక సైనికుడి గా పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలి. కేంద్రంలో మోడీ ప్రభుత్వం ఏర్పడి 11 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మోడీ ప్రభుత్వం డిజిటల్ ట్రాన్సాక్షన్ లో 100 శాతం అధిగమించి. భారత ప్రభుత్వం 40శాతం సంకల్పం సాధించిందని చెప్పారు. మోడీ ప్రభుత్వం 80 శాతం ప్రజలకు ప్రతి వ్యక్తికి 5 కేజీల బియ్యం చొప్పున ఆహార భద్రత కార్డు కలిగిన ప్రజలందరికీ ఉచితంగా అందిస్తుందన్నారు. 370 ఆర్టికల్ భారతదేశంలో అంతర్భాగం అని దీనిని ఎవరు విడదీయరన్నారు. అయోధ్య రామ మందిరం పూర్తి చేయడంలో ప్రధానమంత్రి మోడీ కృషి అమోఘం అన్నారు. ఆపరేషన్ సింధూర్ ద్వారా ఉగ్రవాదాన్ని నలిపివేశారని ఇది మోడీ ప్రభుత్వం ఘనత అన్నారు. 2014 నుండి 2024 వరకు రైతులకు బిజెపి ప్రభుత్వం చేపట్టి న ఎంఎస్పి ద్వారా రైతులు రెట్టింపు ఆదాయం పొందారని పేర్కొన్నారు. పిఎం కిసాన్ ద్వారా దేశంలో 12 కోట్ల రైతులకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ వడ్డేపల్లి నర్సింహ రాములు,జిల్లా ఉపాధ్యక్షులు రేసు శ్రీనివాస్,జిల్లా ఎస్సీ మోర్చా కో కన్వీనర్ కునమల్లా పృథ్వీ,జిల్లా కౌన్సిల్ మెంబర్ పొదిల్లా రామ్ చందర్,జిల్లా నాయకులు మల్యాల వినయ్,కుంభం కోమల్ రెడ్డి శీలం సత్యనారాయణ పట్టణ,మండల కమిటీ సభ్యులు బూత్ అధ్యక్షులు,సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రొఫెసర్ జయశంకర్ సార్ కు ఘన నివాళి అర్పించిన బిఆర్ఎస్ పార్టీ పట్టణ నాయకులు

**నర్సంపేట జూన్ 21(ప్రజా తీర్పు)**

తెలంగాణ ఉద్యమ సిద్ధాంతకర్త ఆచార్య జయశంకర్ సార్ తెలంగాణ రాష్ట్రం కోసం అనునిత్యం పరితపించి మన ప్రాంతానికి జరుగుతున్న అన్యా యాన్ని వెలుగెత్తి చాటి, ఆరు దశాబ్దాల తెలంగాణ ఉద్యమానికి చుక్కానిగా ఉంటూ తెలంగాణ వాదాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మేధావి.మలిదశ ఉద్యమానికి ,తెలంగాణ రాష్ట్ర ఉద్యమ నేత కేసిఆర్ గారితో కలిసి ఉద్యమాన్ని తెలంగాణ రాష్ట్ర నలుమూలల గ్రామ గ్రామాన ఉద్యమ ఆకాంక్షను తెలిపేలా చేశారు..ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్ వర్ధంతి సందర్భంగా బిఆర్ఎస్ పట్టణ పార్టీ ఆధ్వర్యంలో ఘన నివాళి అర్పించడం జరిగింది.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పట్టణ పార్టీ అధ్యక్షులు నాగెల్లి వెంకటనారాయణ గౌడ్, ప్రధాన కార్యదర్శి వేణుముద్దల శ్రీధర్ రెడ్డి, బిఆర్టియు జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు, ప్రచార కార్యదర్శి మండల శ్రీనివాస్ , ఉపాధ్యక్షులు రాయకుల సారంగం, పెండ్యాల యాదగిరి, అప్పాల సుదర్శన్,మాజీ కౌన్సిలర్లు నాగిశెట్టి ప్రసాద్, దేఓజు సదానందం, వాసం సాంబయ్య, మహబూబ్ బాషా, గందె చంద్రమౌళి, పెండెం వెంకటేశ్వర్లు, సుధాకర్ రెడ్డి, వార్డు అధ్యక్షులు నాగిరెడ్డి రవి, సాలన్న, పార్టీ నాయకులు మంద ప్రసాద్, దొమ్మటి సంతోష్, బగ్గి రాజు దేవోజు హేమంత్, నల్ల రవీందర్, కాలే రాజు,ఇతర నాయకులు పాల్గొన్నారు.



## శ్రీప్రగతిలో ఘనంగా జాతీయ యోగ దినోత్సవం

**విద్యార్థులచే యోగ విన్యాసాలు, ఆరోగ్యంపై అవగాహన**

**ప్రజాతీర్పు ప్రతినిధి, రామడుగు జూన్ 21**

జాతీయ యోగ దినోత్సవాన్ని పురస్కరించుకొని రామడుగు మండలం గోపాల్ రావు పేట గ్రామంలోని శ్రీ ప్రగతి పాఠశాలలో యోగ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అనులోమ-విలోమ, కపాలభాతి, సూర్య నమస్కారాలు వంటి యోగ విన్యాసాలను ప్రదర్శించారు. పాఠశాల తరఫున యోగ వలన శరీరానికి, మనస్సుకు కలిగే లాభాలు, దాని ముఖ్యతను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరణాత్మకంగా తెలియజేశారు. యోగ ద్వారా ఒత్తిడి నివారణ, శ్వాసకోశ వ్యవస్థలో మెరుగుదల, ఏకాగ్రత పెంపు వంటి ప్రయోజనాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రాధాకృష్ణ, ప్రిన్సిపాల్ మునిందర్ రెడ్డి, డైరెక్టర్లు, ఇన్చార్జి ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## సిరిసిల్ల పట్టణ పరిధిలో పోలీసు జగిలాలతో ఆకస్మిక తనిఖీలు.

- గంజాయి, ఇతర మత్తు పదార్థాలు కలిగి ఉన్న,ఇతరులకు విక్రయించిన కఠిన చర్యలు తప్పవు.
- మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి బంగారు భవిష్యత్తుకి బాటలు వేసుకోండి.

**ప్రజా తీర్పు ప్రతినిధి సిరిసిల్ల స్టాపర్ జూన్ 21**

మాధకద్రవ్యాల దుర్వినియోగం-అక్రమ రవాణా అవగాహన వారోత్సవాల సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఆదేశాల మేరకు సిరిసిల్ల పట్టణ పరిధిలోని పాన్ షాప్ లలో,బస్టాండ్ ప్రాంతాల్లో,కిరాణా షాప్ లలో మత్తు పదార్థాలను గుర్తించే పోలీస్ జగిలాలతో ,టాస్కోర్స్ సిబ్బంది ఆకస్మిక తనిఖీలు నిర్వహించడం జరిగిందని టాస్కోర్స్ ఇన్స్పెక్టర్ నటేష్ తెలిపారు..ఈ సందర్భంగా టాస్కోర్స్ సి.ఐ మాట్లాడుతూ...జిల్లాలో జిల్లాలో మత్తు పదార్థాల నిర్మూలానే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పని చేస్తుందని,నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా తెలంగాణ ఆంటీ నార్కోటిక్స్ బ్యూరో ద్వారా నిర్వహిస్తున్న డ్రగ్ అవర్నెస్ వీక్ లో భాగంగా శనివారం రోజు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సిరిసిల్ల పట్టణ పరిధిలోని పాన్ షాప్ లలో,బస్టాండ్ ప్రాంతాల్లో,,కిరాణా షాప్ లలో మత్తు పదార్థాలను గుర్తించే పోలీస్ జగిలాలతో ,టాస్కోర్స్ సిబ్బంది ఆకస్మిక తనిఖీలు నిర్వహించడం జరిగిందన్నారు.జిల్లాలో గంజాయి, మరే ఇతర మత్తు పదార్థాలు కలిగి ఉన్న, ఇతరులకు విక్రయించిన చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## మానకొండూరుకు అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ (ATC) మంజూరు

- "మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ గారికి కృతజ్ఞతలు" ... కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి సురేష్ గండికోట.

**(పడకంటి శ్రీనివాస్, ప్రజాతీర్పు ప్రతినిధి, కరీంనగర్ జూన్ 21)**



మనకొండూరు నియోజకవర్గానికి అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ ను మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ ను మానకొండూరు నియోజకవర్గానికి తీసుకు రావడానికి కృషిచేసిన మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ కు నియోజకవర్గ ప్రజలు, నాయకులు కృతజ్ఞతలు తెలియజేశారు. అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ ద్వారా ప్రభుత్వం యువత ఆధునిక నైపుణ్య శిక్షణ అందించనుంది, తద్వారా యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశాలు పెరుగుతాయని ఆనందం వ్యక్తం చేశారు.

# ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడి

- పుస్తకాల వ్యాపారం తక్షణమే చర్యలు తీసుకోవాలి
- ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మంద అనిల్ కుమార్

**ప్రజా తీర్పు ప్రతినిధి సిరిసిల్ల స్టాపర్ జూన్ 21**



రాష్ట్రంలో ప్రైవేటు విద్యాసంస్థలు విద్యను వ్యాపారంగా మలుచుకుని, విద్యార్థుల తల్లిదండ్రులను భారీగా ఆర్థికంగా మోసం చేస్తున్న దారుణ పరిస్థితి రాజన్న సిరిసిల్ల జిల్లాలో కొనసాగుతుందని,ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మంద అనిల్ కుమార్ అన్నారు.అలానే రాజన్న సిరిసిల్ల జిల్లా లో నిబంధనలు, ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాలను లెక్కచేయకుండా ఫీజులు, బస్ ఛార్జీలు,ఇతర ఖర్చుల పేరుతో అమితంగా వసూలు చేస్తున్నారు.ఇక పాఠ్యపుస్తకాల విషయంలో, ప్రభుత్వ నియమాలను ఉల్లంఘించి, ప్రైవేట్ పబ్లిషర్ల పుస్తకాలను తప్పనిసరిగా కొనాలనే ఒత్తిడి పెడుతున్నారు. మార్కెట్లో రూ.200కే దొరికే పుస్తకాన్ని రూ.600కి అమ్మే ప్రయత్నాలు జరుగుతున్నాయి. కొందరు పాఠశాలలు తమకే అనుకూలంగా ముద్రించిన నోట్స్, వర్క్‌బుక్స్ పేరుతో కొన్ని వేల రూపాయల మేర డబ్బులు వసూలు చేస్తున్నారు.ఈ విధమైన దోపిడిపై ప్రభుత్వం తక్షణంగా చర్యలు తీసుకోవాలనీ మంద అనిల్ కుమార్ అన్నారు. జిల్లా విద్యాధికారి (డి.ఈ.ఓ), మండల విద్యాధికారి (ఎం.ఈ.ఓ)లు ప్రతి పాఠశాలపై సమీక్ష జరిపి, ఫీజుల వివరాలు, పుస్తక వితరణ వివరాలను సేకరించాలి. విద్యార్థుల భవిష్యత్‌ను డబ్బు కోసం పణంగా పెట్టే విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. అధికారులు స్పందించి విద్యార్థులకు న్యాయం చేయాలి అలాగే ప్రైవేటు పాఠశాలను ఫీజుల పేరుతో దోపిడీ కి ఇబ్బందులకు గురి చేస్తే ప్రత్యేక దాడులు నిర్వహిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు పెండెల అధిత్య, నాయకులు బండారి చందు, సావనపెల్లి విష్ణు, సురేందర్, ఏనుగుల అరవింద్,అనిల్,జుట్టు అఖిల్,మహేష్,రాజు తదితరులు పాల్గొన్నారు.

## అప్పుల బాధ తో నేత కార్మికుడు హత్మ హత్య

**ప్రజా తీర్పు ప్రతినిధి సిరిసిల్ల, స్టాపర్ జూన్**



రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని సుందరయ్య నగర్ కు చెందిన ఓ చేనేత కార్మికుడు ఉరివేసుకొని ఆత్మ హత్య చేసుకున్న సంఘటన శనివారం చోటుచేసుకుంది. స్థానికుల కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం వలస రమేష్(48) అనే కార్మికుడు పవర్ లూమ్స్ నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. రమేష్ గత ఏడాది పాటు సరైన ఉపాధి లేక చేసిన 5 లక్షలు అప్పులను ఎలా తీర్చాలో తెలియక తీవ్ర మనస్థాపానికి గురై శనివారం కార్గిల్ లేక్ చెరువులో దూకి హత్మ హత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృత్యాహాన్ని పరిశీలించి సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుని భార్య లావణ్య, సాయి చరణ్, సచిన్ అనే ఇద్దరు కొడుకులు ఉన్నారు. భార్య లావణ్య ఫిర్యాదు మేరకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# తీగల వంతెన పనుల నాణ్యత పై, అవినీతిపై విజిలెన్స్ విచారణ స్వాగతిస్తున్నాము

- అవినితిలో భాగస్వామ్యులైన ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్ పై క్రిమినల్ కేసు నమోదు చేయాలి : సిపిఐ

**(పడకంటి శ్రీనివాస్, ప్రజాతీర్పు ప్రతినిధి, కరీంనగర్ జూన్ 21)**




కరీంనగర్ నగర శివారు లో బిఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన తీగల వంతెన నిర్మాణ పనుల్లో అవినీతి అక్రమాలు జరిగాయని దీనిపై సిపిఐ ఆధ్వర్యంలో అనేకసార్లు పోరాటాలు చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకురాగా నిన్న తీగల వంతెన నాణ్యత ప్రమాణాలపై విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు విచారణ జరిపించడానికి స్వాగతిస్తున్నట్లు సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, నగర సహాయ కార్యదర్శిలు పైడిపల్లి రాజు, న్యాలపట్ల రాజు ఒక ప్రకటనలో తెలిపారు. తీగల వంతెనకు మొదట 80 కోట్లు కేటాయించగా అవి సరిపోవని బిఆర్ఎస్ నాయకులు అప్పటి మంత్రి ఎమ్మెల్యే గంగుల కమలాకర్ 224 కోట్ల పైగా నిధులు కేటాయించి నిర్మాణం పూర్తికాకముందే ప్రారంభించిన కొన్ని రోజులకే రోడ్డు పగుళ్లు రావడం, లైట్లు వెలగకపోవడం, ఒక బ్రిడ్జ్ కొంతమేర కుంగిపోవడం లాంటి సంఘటనలు జరిగాయని, హడావుడిగా గత ప్రభుత్వం ఈ తీగల వంతెన నిర్మాణం చేసి నేటికీ కూడా నిత్యం ఏదో ఒక చోట నాణ్యత లోపించి మళ్లీ పనులు జరుగుతున్నాయని, తీగల వంత నిర్మాణంలో జరిగిన అవినీతి అక్ర అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని బాధ్యులైన కాంట్రాక్టర్ ప్రజాప్రతినిధులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో నిర్మించిన ఈ యొక్క తీగల వంతెన నిర్మాణంలో కోట్ల రూపాయల అవినీతి జరిగిందని ఇందులో స్థానిక ఎమ్మెల్యే, మేయర్, కార్పొరేటర్ అక్రమాలు చేశారని వీరిని కూడా విజిలెన్స్ అధికారులు పిలిచి విచారణ జరిపించాలని వారు కోరారు. కరీంనగర్ నగర ప్రజలకు తీగల వంతెన రెండు వైపులా అందుబాటులోకి తీసుకురావాలని లైట్లు వెలిగేలా నగర పాలక సంస్థ ప్రభుత్వం చొరవ తీసుకోవాలని సురేందర్ రెడ్డి, పైడిపల్లి రాజు, న్యాలపట్ల రాజు డిమాండ్ చేశారు.



## తిలక్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యోగ డే పాల్గొన్న ఏసిపి సీఐ

**మంచిర్యాల జిల్లా ప్రజాతీర్పు ప్రతినిధి వి వెంకటేష్ జూన్ 21**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా బెల్లంపల్లి తిలక్ గ్రౌండ్ లో జాతీయ యోగ దినోత్సవం పురస్కరించుకొని యోగాసనాలు చేశారు బెల్లంపల్లి ఏసీపి రవికుమార్ రూరల్ సీఐ అఫ్జలుద్దీన్ యోగా దినోత్సవం లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తిలక్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎసిపి రవికుమార్ ని సన్మానించారు

# బీసీ సంక్షేమ వసతి గృహాలకు పక్కాభవనాలు నిర్మించాలి

**– బీసీ సంఘాల జేఏసీ**

**(పడకంటి శ్రీనివాస్, ప్రజాతీర్పు ప్రతినిధి, కరీంనగర్ జూన్ 21)**




బీసీ సంక్షేమ వసతి గృహాల నిర్మాణానికి భూమిని కేటాయించాలని కరీంనగర్ మండల రెవెన్యూ అధికారికి బీసీ సంఘాల జేఏసీ పక్షాన వినతి పత్రం సమర్పించారు. బీసీ సంక్షేమ వసతి గృహాల నిర్మాణానికి భూమిని కేటాయించాలని కరీంనగర్ మండల రెవెన్యూ అధికారి ఇప్ప నరేందర్ కు బీసీ సంఘాల జేఏసీ పక్షాన వినతి పత్రం సమర్పించడం జరిగింది. కరీంనగర్ లోని నాలుగు కళాశాల స్థాయి బీసీ బాలుర, నాలుగు కళాశాల స్థాయి బీసీ బాలికల వసతి గృహాలు అద్దె భవనాలలో నడుస్తున్నాయి. వీటికి ప్రభుత్వ భవనాలు నిర్మించడానికి భూమిని కేటాయించాలని, కరీంనగర్ మండల రెవెన్యూ అధికారి కి బీసీ సంఘాల జేఏసీ పక్షాన కోరడం జరిగింది. ఈ సందర్భంగా బీసీ జేఏసీ నాయకులు మాట్లాడుతూ నగరంతో పాటుగా చుట్టుపక్కల గ్రామాలలో ఎకరాల కొద్ది ప్రభుత్వ భూమి ఉండగా ఇలా ప్రభుత్వ బీసీ సంక్షేమ వసతి గృహాలు అద్దె భవనాలలో లక్షలాది రూపాయల అద్దె చెల్లించుతున్నాయి. ప్రభుత్వం వెంటనే నగరంలోని అన్ని బీసీ సంక్షేమ వసతి గృహాలకు పక్కాభవనాలు నిర్మించాలని, దాని కొరకు ప్రభుత్వ భూమిని కేటాయించాలని బీసీ సంఘాల పక్షాన కోరుతున్నాం. బీసీ సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండడం ప్రైవేట్ భవనాలలో సౌకర్యాలు సరిగా లేకపోవడం, అలాగే ప్రభుత్వం ఏళ్ల తరబడి అద్దె బకాయిలు చెల్లించకపోవడం అలాగే ఇంటి యజమానులు భవనాలను ఖాళీ చేయమని ఇబ్బంది పెట్టడం జరుగుతుంది. దీనిని దృష్టిలో పెట్టుకొని వెంటనే అన్ని ప్రభుత్వ బీసీ వసతి గృహాలకు భూమిని కేటాయించాలని అలాగే ప్రభుత్వం నిర్మాణానికి నిధులు కేటాయించాలని బీసీ సంఘాల జేఏసీ పక్షాన కోరుతున్నాం. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల జేఏసీ నాయకులు కే శి పెద్ది శ్రీధర్ రాజు, దొగ్గలి శ్రీధర్ , బత్తుల మల్లేశం, మంతెన కిరణ్, మియాపూర్ రవీంద్ర చారి తదితరులు పాల్గొన్నారు..

# ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలపై బ్యాంకర్లు దృష్టి సారించాలి:జిల్లా కలెక్టర్

- యువతకు మరింత మెరుగ్గా స్వయం ఉపాధి కల్పన కు చర్యలు
- ప్రజలలో ఆర్థిక అక్షరాస్యత పెంచే విధంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలి
- బ్యాంకర్లతో మార్చి 31, 2025 త్రైమాసిక డీసీసీ డీ.ఎల్.ఆర్.సి సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్



**ప్రజా తీర్పు ప్రతినిధి సిరిసిల్ల, స్టాపర్ జూన్ 21**

ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలపై బ్యాంకర్లు దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ బ్యాంకర్లను ఆదేశించారు. శనివారం ఉదయం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సమీకృత జిల్లా కలెక్టరేట్ లో బ్యాంకర్లతో మార్చి 31, 2025 త్రైమాసిక డీసీసీ, డీ.ఎల్.ఆర్.సి. సమావేశం ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ..... జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమున్న చోట నూతన బ్యాంక్ బ్రాంచ్ ప్రారంభించేందుకు గల అవకాశాలను పరిశీలించాలని కలెక్టర్ బ్యాంకర్లను ఆదేశించారు. 500 ఇండ్ల ఉన్న ఆవాసాలలో మొత్తం 323 బ్యాంకింగ్ అవుట్ లెట్ లను జిల్లాలో ఏర్పాటు చేశామని అన్నారు. జిల్లాలోని బ్యాంకులు డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించాలని అన్నారు. క్యూఆర్ కోడ్ లేని వ్యాపారస్థులను గుర్తించి వారికి ఆ సదుపాయాల కల్పనతో బ్యాంకు ఖాతా ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలని అన్నారు. జన ధన్ బ్యాంక్ ఖాతా దారులందరు ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, పి.ఎం.జె.జె.బీ.వై పథకాలలో నమోదు చేసుకునేలా చూడాలని అన్నారు. పబ్లిక్ ఔట్ రీచ్ కార్యక్రమాల్లో వీటి పై విస్తృత ప్రచారం కల్పించాలని అన్నారు. ప్రజలలో ఆర్థిక అక్షరాస్యత పెంచే విధంగా అవగాహన కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించాలని అన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 1519 కోట్ల రూపాయల పంట రుణ లక్ష్యానికి 1093 కోట్లు, 196 కోట్ల రూపాయల వ్యవసాయ టర్మ్ రుణాలకు గాను దాదాపు 554 కోట్ల రుణాలు అందించామని అధికారులు తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నిర్దేశించుకున్న పంట రుణ లక్ష్యాలను నూరు శాతం చేరుకోవాలని కలెక్టర్ బ్యాంకర్లను ఆదేశించారు. ఎం.ఎస్.ఎం.ఈ రంగానికి నిర్దేశించిన లక్ష్యంలో కేవలం 59 శాతం మాత్రమే రుణాలు పంపిణీ చేయడం జరిగిందని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పెద్ద ఎత్తున చిన్న సూక్ష్మ పరిశ్రమల ప్రోత్సహించేలా రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో విద్య రుణాల పంపిణీ 16 శాతం, ఇంటి నిర్మాణ రుణాల పంపిణీ 70 శాతం మాత్రమే చేరుకోవడానికి గల కారణాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. బ్యాంకులో అందించే వివిధ విద్య రుణాలు పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో జూన్ 16 నాటికి 82 స్వశక్తి సంఘాలకు 8 కోట్ల 17 లక్షలు, మెప్మా కింద 118 సంఘాలకు 14 కోట్ల 50 లక్షల బ్యాంకు రుణాలు అందించామని అధికారులు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో సెర్ఫ్ రుణాల పంపిణీ వేగవంతం చేయాలని, ఎం.సి.పి లను త్వరగా బ్యాంకులకు సమర్పించాలని కలెక్టర్ తెలిపారు. స్వయం ఉపాధిని ప్రోత్సహించేందుకు వివిధ పథకాల క్రింద యువతకు రుణాలు అందించాలని, 2024-25 సంవత్సరంలో స్టాండ్ అప్ ఇండియా క్రింద 16 యూనిట్లకు 2 కోట్ల రుణాలు మంజూరు చేశామని, ముద్రా రుణాల కింద 8 వేల 220 మంది లబ్ధిదారులకు 101 కోట్ల 24 లక్షల రుణాలు పంపిణీ జరిగినట్లు, పీ.ఎం.ఎఫ్.ఎం.ఈ క్రింద 63 దరఖాస్తులను ఆమోదించామని తెలిపారు. కుల వృత్తులు, చేతి వృత్తుల వారికి అవసరమైన నైపుణ్య శిక్షణ అందిస్తూ ఉపాధి కల్పించే దిశగా యూనిట్ల ఏర్పాటుకు రుణాలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి విశ్వకర్మ పథకాన్ని ప్రారంభించిందని, దీనికోసం వచ్చే ఐదు సంవత్సరాల కాలానికి 13 వేల కోట్లు నిధులను కేటాయించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. పీఎం విశ్వకర్మ పథకం పట్ల విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని, జిల్లాలో ఇప్పటి వరకు 343 దరఖాస్తులకు నిబంధనల ప్రకారం పథకం మంజూరు చేసామని, పెండింగ్ ఉన్న 753 దరఖాస్తులను పక్కకు ఇచ్చేసి అర్హులకు పథకం అమలు చేయాలని కలెక్టర్ సూచించారు.

అనంతరం 2025-26 ఆర్థిక సంవత్సరం సంబంధించి వార్షిక రుణ ప్రణాళిక పుస్తకాన్ని ఆవిష్కరించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి వార్షిక రుణ ప్రణాళిక మొత్తం 4 వేల 890 కోట్ల రూపాయల రుణాల పంపిణీ లక్ష్యంగా తయారు చేయడం జరిగింది. వీటిలో భాగంగా 92 వేల 428 మంది రైతులకు దాదాపు 1700 కోట్ల పంట రుణాల పంపిణీ, 22 వేల 525 మంది రైతులకు 1006 కోట్ల వ్యవసాయ టర్మ్ రుణాల పంపిణీ, 10082 మంది రైతులకు 277 కోట్ల వ్యవసాయాధారిత రుణాల పంపిణీ, ఎం.ఎస్.ఎం.ఈ. రంగానికి 612 కోట్ల 30 లక్షల లక్ష్యంగా నిర్దేశించడం జరిగింది. ఈ సమావేశంలో ఆర్.బి.ఐ ప్రతినిధి వి. సాయితేజ్ రెడ్డి, డిడిఎం నాబార్డు దీలిప్ చంద్రా, యూ.బి.ఐ రీజనల్ హెడ్ డి. అపర్ణ రెడ్డి, లీడ్ బ్యాంకు మేనేజర్ టి.మల్లిఖార్జున్ రావు, డి.ఆర్.డి.ఓ. శేషాద్రి, డి.వి.హెచ్.ఓ. రవీందర్ రెడ్డి జి.ఎం.డి.ఐ.సి. హనుమంతు, ఈ.డి.ఎస్ సి కార్పొరేషన్ స్వప్న, మున్సిపల్ కమిషనర్లు, వివిధ శాఖల బ్యాంక్ మేనేజర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై అదనపు కలెక్టర్ కీలక ఆదేశాలు

**నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్21(ప్రజాతీర్పు):**

జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం మరింత వేగంగా పూర్తయ్యేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ఆదేశించారు. శనివారం రాష్ట్ర గృహ నిర్మాణ మేనేజింగ్ డైరెక్టర్ వి.పి. గౌతమ్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం ఆయన కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ఇందిరమ్మ రెండో దశ ఇండ్లకు సంబంధించిన మార్కింగ్, గ్రౌండింగ్ పనులను ప్రతిరోజూ పర్యవేక్షిస్తూ త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మంజూరైన స్థలాల్లో నిర్మాణం ప్రారంభించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలనీ, పనులపై అధికారులు స్పష్టతతో వ్యవహరించాలని సూచించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన (అర్బన్) లబ్ధిదారుల ఓటిపి వెరిఫికేషన్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని, ఇందుకోసం వార్డు స్థాయి అధికారులకు నియోజకవర్గాల వారీగా శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. పట్టణాల్లో నిర్మాణ పనుల ప్రగతిపై అధికారులందరూ నివేదికలు సమర్పించాలని తెలిపారు. ఈ సమావేశంలో హౌసింగ్ పీడీ రాజేశ్వర్, గృహ నిర్మాణ, మున్సిపల్ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఇందిరా మహిళా శక్తి భవనం గడువులోగా పూర్తి చేయాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయం ఆకస్మిక తనిఖీ



**ప్రజా తీర్పు ప్రతినిధి సిరిసిల్ల, స్టాపర్ జూన్ - 21**

ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణ పనులు నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని మెడికల్ కళాశాల సమీపంలో రూ. 5 కోట్ల నిధులతో ఎకరం స్థలంలో నిర్మిస్తున్న భవన నిర్మాణ పనులను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ పనులను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ఇందిరా మహిళాశక్తి భవన నిర్మాణ పనులను ఈ ఏడాది నవంబర్ లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. భవనం అందుబాటులోకి వస్తే మహిళా సంఘాల సభ్యులకు మీటింగులు, శిక్షణ వివిధ ప్రభుత్వ అవసరాలకు ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు.

**ప్రశ్నలు అడిగి.. సమాధానాలు రాబట్టి**

సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయాన్ని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా వంట గది, స్టోర్ రూమ్ ను పరిశీలించారు. ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేశారు. అనంతరం తరగతి గదుల్లో పాఠ్యాంశాలు బోధిస్తున్న తీరును పరిశీలించారు. విద్యార్థులకు మ్యాథ్స్ పాఠ్యాంశాలు బోధించి.. ప్రశ్నలు వేసి.. సమాధానాలు రాబట్టారు. ప్రతి పాఠ్యాంశాన్ని శ్రద్ధగా చదవాలని, అనుమానాలు నివృత్తి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విద్యాలయం ఎస్ఓ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## రైతుల ఖాతాల్లో రూ. 133.5 కోట్ల రైతు భరోసా నిధులు జమ

- 1,22,019 మంది జిల్లా రైతులకు లబ్ది
- హర్షం వ్యక్తం చేస్తున్న జిల్లా రైతులు
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**ప్రజా తీర్పు ప్రతినిధి సిరిసిల్ల స్టాపర్ జూన్ 21**

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని అన్నదాతలకు రైతు భరోసా కింద రూ. 133.5 కోట్లకు పైగా డబ్బులు రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమ అయ్యాయని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా శనివారంవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఖరీఫ్ వానాకాలం సీజన్ సాగు కోసం రైతులకు ఉపయోగపడేలా రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కింద నిధులు విడుదల చేస్తుందని తెలిపారు. ఈ రోజు వరకు జిల్లాలోని 13 మండలాల పరిధిలోని 1,22,019 మంది రైతుల బ్యాంక్ ఖాతాల్లో రూ. 133,53,84,248= 00 డబ్బులు జమ అయ్యాయని, జిల్లా రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు.



# కోడెలకు పచ్చిగడ్డి వితరణకు దాతలు ముందుకురావాలి

- జిల్లా పశు వైద్యాధికారి రవీందర్ రెడ్డి
- పచ్చిగడ్డి వితరణ చేసిన పలువురు దాతలు




**ప్రజా తీర్పు ప్రతినిధి సిరిసిల్ల, స్టాపర్ జూన్ 21**

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారికి అత్యంత ప్రీతి పాత్రమైన కోడెలకు దాతలు పచ్చిగడ్డి వితరణ చేసేందుకు ముందుకురావాలని జిల్లా పశు వైద్యాధికారి రవీందర్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో కోరారు. కోడెలకు దాతలు పచ్చిగడ్డి వితరణ చేసి రాజన్న సేవలో భాగస్వామ్యులు కావాలని ఆకాంక్షించారు. లింగంపేటకు చెందిన పెగ్గర్ల రమేష్ రావు, రైతు ఆధ్వర్యంలో ఏనుగుల అనిల్ వేములవాడ రాజరాజేశ్వర స్వామి గోశాలకు దాదాపు 1500 కిలోల పచ్చి గడ్డి పంపించారని తెలిపారు. ఇప్పటిదాకా 7500 కిలోల గడ్డిని వితరణ చేశారని వివరించారు. వితరణ చేసిన వారిలో రాజన్న భక్తులు రైతు బిడ్డలు చందరశేఖర్ రావు, రామరావు, బోడపట్ల జలేందర్, ఈగ ప్రవీణ్, మనోహర్ ఉన్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారిని అభినందించారు. గ్రామాలలో ఎవరి వద్ద అయినా మిగులు గడ్డి ఉంటే స్వామి వారి కోడెలకు ఇవ్వాలని జిల్లా పశు వైద్యాధికారి రవీందర్ రెడ్డి కోరారు.




## కోర్టు డ్యూటీ ఆఫీసర్స్ ప్రతిభ కు గుర్తింపు

- లోక్ అదాలత్ లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిడిఒ, ఏపిపి లకు ప్రశంస పత్రాలను అందజేసిన జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల

**నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్21(ప్రజాతీర్పు):**

జాతీయ మెగా లోక్ అదాలత్ సందర్భంగా నిర్మల్ జిల్లా పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో విచారణలో ఉన్న , కోర్టు పరిధిలో ఉన్న కేసుల పరిష్కారంలో ప్రత్యేక కృషి చేసిన పోలీస్ అధికారులకు, సిబ్బందికి జిల్లా ఎస్పీ ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ లోక్ అదాలత్ లో మొత్తం మూడువేలకు పైగా కేసులు వివిధ విభాగాలలో రాజీ పద్ధతిలో పరిష్కరించబడినవి. ఈ కేసుల పరిష్కారంలో పోలీస్ శాఖలోని అయిదుగురు పబ్లిక్ ప్రాసిక్యూటర్ లు, ముగ్గురు లైజెనింగ్ ఆఫీసర్లు, 27 మంది కోర్టు కానిస్టేబుళ్లు విశేష కృషి చేసి ప్రజలకు వేగవంతమైన న్యాయం అందించడంలో ముఖ్యపాత్ర పోషించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల మాట్లాడుతూ: కష్టపడి పని చేసి ప్రతిభ కనబరిచిన వారికి ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుంది. ఎటువంటి బాధ్యతను అప్పగించినా మన పోలీస్ సిబ్బంది పూర్తి నిబద్ధతతో పని చేస్తారు. వారి సేవలకు గుర్తింపుగా ప్రశంసా పత్రాలు, అందజేశామని పేర్కొన్నారు. ప్రస్తుత కార్యక్రమంలో ఎస్పీ స్వయంగా అధికారులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఇది ఇతరులకు ప్రేరణగా నిలుస్తుందని, లోక్ అదాలత్ వేదికగా ప్రజల సమస్యలు వేగంగా పరిష్కరించడంలో పోలీసుల పాత్ర మరింత బలపడుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్ ,నిర్మల్ ఏఎస్పీ రాజేష్ మీన ,ఇన్స్పెక్టర్లు గోవర్ధన్ రెడ్డి, ప్రవీణ్ కుమార్,ఆర్ ఐ లు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, లైజెనింగ్ ఆఫీసర్లు, కోర్టు డ్యూటీ కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.



## కాంగ్రెస్ నాయకుడిని పరామర్శించిన బీజేపీ నాయకులు

**ప్రజాతీర్పు ప్రతినిధి, రామడుగు జూన్ 21**

రామడుగు మండలం చిప్పకుర్తి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు పులి ఆంజనేయులు గౌడ్ తండ్రి ఇటీవల మరణించగా, బీజేపీ నాయకులు వారి తండ్రి చిత్రపటానికి పూలు వేసి నివాళులు అర్పించి, ఆంజనేయులు గౌడ్ ను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేకల ప్రభాకర్ యాదవ్, మండల శాఖ అధ్యక్షులు మోడి రవీందర్, జిల్లా కార్యదర్శి ఉప్పు రాంకిషన్, మాజీ మండల అధ్యక్షులు ఒంటెల కరుణాకర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పు శ్రీనివాస్ పటేల్ పాల్గొన్నారు.

## ఓకే ఇంటి స్థలం ఇద్దరికీ కేటాయింపు 2008లో ఒకరికి, 2020లో మరొకరికి

**ప్రజా తీర్పు ప్రతినిధి సిరిసిల్ల స్టాపర్ ఎల్లారెడ్డిపేట జూన్ 21**



రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన ఇందిరమ్మ కాలనీలో 100 గజాల స్థలాన్ని ఇద్దరు మహిళలకు అధికారులు కేటాయించారని గుగ్గిల లక్ష్మి ఆవేదన వ్యక్తం చేసింది. 2008లో పొలాస శారదకు కేటాయించారు అనంతరం ఆమె ఆ స్థలంలో ఎలాంటి ఇంటి నిర్మాణం చేపట్టకపోవడంతో 2020 తాజా మాజీ సర్పంచ్ పాలకవర్గం గుగ్గిళ్ళ లక్ష్మి కి తీర్మాన చేసి కాపీని అందజేశారు. గుగ్గిళ్ళ లక్ష్మి పోచమ్మ దేవాలయం వద్ద తన ఇంటి స్థలాన్ని గుడి కోసం అప్పటి పాలకవర్గం తీసుకోవడంతో ఆ స్థలానికి బదులుగా ఇందిరమ్మ కాలనీలోని ఎనిమిదవ నెంబర్ 100 గజాల ప్లాట్ ను అందజేశారు. గుగ్గిళ్ళ లక్ష్మి ఆమె భర్త కు ఆరోగ్యం బాగా 2025 వరకు వేచి ఉన్నది. అట్టి ఇంటి స్థలంలో నూతన ఇల్లు నిర్మాణం చేసుకోవడానికి పనులు ప్రారంభించింది. పొలాస శారద మహిళ సమాచారం తెలుసుకొని గ్రామపంచాయతీలో ఫిర్యాదు చేసింది. ఓకే స్థలాన్ని ఇద్దరు మహిళలకు కేటాయించడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఉచితంగా ఇచ్చిన ఇండ్ల పట్టాలను ఎలాంటి సమాచారం లేకుండా నిర్లక్ష్యంగా ఒకే స్థలాన్ని ఇద్దరు మహిళలు కేటాయించి ఇప్పుడు ఇల్లు కట్టుకుందామంటే తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని గుగ్గిల లక్ష్మి ఆరోపించింది. సదరు బాధితురాలు లక్ష్మి ఇప్పుడున్న పంచాయతీ కార్యదర్శికి ఇదేంటి అని ప్రశ్నించగా నాకు ఎలాంటి సంబంధం లేదు అని సమాధానమిచ్చాడని ఆమె తెలిపింది. నిరుపేద కుటుంబానికి చెందిన లక్ష్మీ స్థలాన్ని ఇచ్చినట్టే ఇచ్చి మళ్లీ లాక్కున్నారని లక్ష్మి లబో దీపం అంటూ రోధిస్తూ తెలిపింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకొని నాకు రావాల్సిన స్థలం ఇవ్వకుంటే జిల్లా కలెక్టర్ కు సోమవారం రోజు ఫిర్యాదు చేయనట్లు ఆమె తెలిపింది.

## ఈర్యతండా అంగన్వాడీలో అక్షరాభ్యాసం నిర్వహించిన టీచర్ మేడి సరోజన

**చెన్నారావు పేట జూన్ 21( ప్రజా తీర్పు)**

చెన్నారావుపేట మండల కేంద్రంలోని శివారు ఈర్య తండాలో అంగన్వాడి టీచర్ మేడి సరోజన ఆధ్వర్యంలో అంగన్వాడి చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బానోతు సాయి వర్ధన్, సాయి కృష్ణ ,సాన్విక,ధరమ్ సోతు రుషి కుమార్, గుగురోతు అక్షర లకు పలక బలపాలు అందించి అక్షరాలు దిద్దించడం జరిగింది. అనంతరం యోగ దినోత్సవ సందర్భంగా పిల్లలకు వారి తల్లిదండ్రులకు యోగ గురించి అవగాహన పరిచి వారి చేత ఆసనాలు వేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పవనకుమారి టీచర్ ఆరాధన ఏఎన్ఎం పుష్పరత ఆశ సుశీల పిల్లల తల్లిదండ్రులు పిల్లలు పాల్గొన్నారు.



## 17వ పోలీస్ బెటాలియన్ సర్దాపూర్ నందు అంతర్జాతీయ యోగా దినోత్సవం

### మనిషి మానసిక శారీరక ప్రశాంతతకు,ఒత్తిడిని జయించడానికి యోగా అభ్యాసం తోడ్పడుతుంది: కమాండెంట్ సురేష్

**ప్రజా తీర్పు ప్రతినిధి సిరిసిల్ల స్టాపర్ జూన్ 21**

అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని ఏర్పాటు చేసిన యోగా కార్యక్రమంలో 17వ పోలీస్ బెటాలియన్ సిబ్బంది కలిసి యోగా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం కమాండెంట్ మాట్లాడుతూ మనిషి మానసిక,శారీరక ప్రశాంతతకు,ఆరోగ్యానికి యోగా ఎంతగానో దోహదం చేస్తుంది కాబట్టే ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలు యోగాను పాటిస్తున్నాయన్నారు. మనస్సును,శరీరాన్ని ఏకం చేసి ఆధ్యాత్మికతను అందించేదే యోగా అని చెబుతారు. యోగాను నిత్యం అభ్యసించడం వలన ఒత్తిడిని అధిగమించవచ్చని తెలిపారు. భారతదేశంలో వేద కాలం నుంచే యోగ ఉందని ప్రాచీన గ్రంథాలు చెబుతున్నాయి అని తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవ ప్రతిపాదనను ప్రధాని నరేంద్ర మోదీ ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమావేశం ముందు పెట్టారని దానికి ఐరాస మద్దతు లభించడంతో 2015 జూన్ 21నుంచి అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని ఆరోజున అన్ని దేశాలు యోగా డేగా పాటిస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ శ్రీ జగదీశ్వర్ రావ్,అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.



## బోజేర్వు ఎంపీ యుపి ఏస్ లో పేరెంట్స్ టీచర్స్ సమావేశం

**చెన్నారావుపేట జూన్ 21(ప్రజా తీర్పు)**

చెన్నారావుపేట మండలంలోని బోజేర్వు ఎంపీ యుపిఎస్ పాఠశాల నందు ప్రతి నెల మూడవ శనివారం నిర్వహించే తల్లిదండ్రుల మరియు టీచర్ల సమావేశంలో బాగంగా ఈ విద్యా సంవత్సరం మొదటి సమావేశం జరిగింది. ఈ సమావేశనికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు పిల్లల తల్లిదండ్రులకు రెండు రోజుల ముందు ఆహ్వాన పత్రాలు అందించగా పిల్లల తల్లిదండ్రులు అందరూ పాల్గొని పాఠశాల విద్య మరియు పాఠశాల యొక్క అభివృద్ధి గురించి చర్చించుకుని కమిటీ వేసుకుని అనేక అంశాలను తీర్మానించడం జరిగింది. ఈ సమావేశంలో ప్రధానోపాధ్యాయులు రవీందర్ సార్ మాట్లాడుతూ మీ యొక్క పిల్లలను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లడానికి ఉపాధ్యాయులుగా మేము అహర్నిశలు కృషి చేసి ఉన్నతమైన విద్యార్థులుగా తీర్చి దిద్దుతామని వారు మరియు ఉపాధ్యాయులు అందరూ చెప్పడం జరిగింది. పిల్లల తల్లి దండ్రులు అనేక అంశాలపై ఉపాధ్యాయులను ప్రశ్నలు అడగడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల టీచర్స్ మరియు అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ వెంకటలక్ష్మి , పేరెంట్స్ కమిటీ సభ్యులు నూకల కృష్ణ , ఇట్టబోయిన రాజు, నూకల రమేష్ ,పిండి కుమారస్వామి, బండ బోయిన రాజు ,బండి నాగరాజు ,ఇట్టబోయిన అనిల్, రాజులపాటి శ్రీలత ,ఇట్టబోయిన కోమల, మరియు పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## మాధకద్రవ్యాలకు దూరంగా ఉండండి- యాంటీ డ్రగ్ సోల్జర్ గా మారండి.

- మత్తుపదార్థాలకు బానిస కాకండి జీవితాలను చిత్తు చేసుకోకండి.
- మాధకద్రవ్యాల అవగాహన వారోత్సవాలకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించిన జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే

**ప్రజా తీర్పు ప్రతినిధి సిరిసిల్ల స్టాపర్ జూన్ 21**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో కళాశాలలో, పాఠశాలలో యోగ వేడుకల్లో పాల్గొని మత్తుపదార్థాల వలన కలుగు అనర్థాలపై అవగాహన కల్పించిన అధికారులు.ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ...నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా తెలంగాణ ఆంటీ నార్కోటిక్స్ బ్యూరో ద్వారా జిల్లా వ్యాప్తంగా పాఠశాల, కళాశాలలో విద్యార్థిని విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగం వలన కలిగే పరిణామాలపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరిగిందని అందులో భాగంగా ఈరోజు జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో మాధకద్రవ్యాల అవగాహన వారోత్సవాలకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించడం జరిగింది.జిల్లాలో ప్రతి పోలీస్ స్టేషన్ల పరిధిలో విద్యార్థిని విద్యార్థులతో యోగ కార్యక్రమంలో పాల్గొని మత్తుపదార్థాల వలన కలుగు అనర్థాలపై అవగాహన కల్పించారు.ఈకార్యక్రమంలో వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, అదనపు ఎస్పీ చంద్రయ్య, సి.ఐ లు,ఆర్.ఐ లు,ఎస్.ఐ లు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఈర్యతండా అంగన్వాడీలో అక్షరాభ్యాసం నిర్వహించిన టీచర్ మేడి సరోజన

**చెన్నారావు పేట జూన్ 21( ప్రజా తీర్పు)**



చెన్నారావుపేట మండల కేంద్రంలోని శివారు ఈర్య తండాలో అంగన్వాడి టీచర్ మేడి సరోజన ఆధ్వర్యంలో అంగన్వాడి చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బానోతు సాయి వర్ధన్, సాయి కృష్ణ ,సాన్విక,ధరమ్ సోతు రుషి కుమార్, గుగురోతు అక్షర లకు పలక బలపాలు అందించి అక్షరాలు దిద్దించడం జరిగింది.అనంతరం యోగ దినోత్సవ సందర్భంగా పిల్లలకు వారి తల్లిదండ్రులకు యోగ గురించి అవగాహన పరిచి వారి చేత ఆసనాలు వేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పవనకుమారి టీచర్ ఆరాధన ఏఎన్ఎం పుష్పరత ఆశ సుశీల పిల్లల తల్లిదండ్రులు పిల్లలు పాల్గొన్నారు.

# హఠయోగ ఆశ్రమం ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

### ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్

**జవహర్ నగర్/ దమ్మాయిగూడ ప్రజా తీర్పు ప్రతినిధి (వినోద్) :-**



అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని పురస్కరించుకొని యోగ గురువు శంకరాచారి ఆధ్వర్యంలో దమ్మాయిగూడ మున్సిపాలిటీలోని సాయి భవాని ఫంక్షన్ హాల్లో యోగ వేడుకలను 21 శనివారం రోజున అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి మాట్లాడుతూ, "నాకు ఇప్పుడు 72 ఏళ్ల వయసు ఉందని. నా ఆరోగ్య రహస్యం ప్రతి రోజూ యోగా చేయడమే," అని తెలిపారు. యోగా వల్ల శరీరం, మనసు కూడా ఆరోగ్యంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా హఠ యోగ ఆశ్రమ వ్యవస్థాపక అధ్యక్షులు శంకరాచారి మాట్లాడుతూ, యోగా కేవలం శారీరక వ్యాయామం మాత్రమే కాకుండా, మనస్సు, శరీరం, శ్వాసపై నియంత్రణ కలిగించే గొప్ప శాస్త్రమని వివరించారు. యోగాను ప్రతిరోజూ ఆచరించడం వల్ల ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం పెరిగి, ఒత్తిడి ఆందోళన తగ్గుతుందని అన్నారు. రక్తపోటు మధుమేహం లాంటి దీర్ఘ కాలిక వ్యాధులను నయం చేయడంలో యోగ బ్రహ్మాస్త్రం లా పనిచేస్తుందని తెలిపారు. చిన్నా పెద్ద తేడా లేకుండా అందరూ యోగ సాధన చేస్తూ ఆయురాగ్యాలతో ఆనందంగా జీవించాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో ప్రజల్లో యోగ పై అవగాహన కల్పించడానికి అనేక కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఎందుకు ప్రభుత్వం సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారందరూ యోగా ఆసనాలతో పాటు అందులోని మెళకువలను ఆసక్తిగా నేర్చుకుంటూ చురుకుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దమ్మాయిగూడ మున్సిపల్ మాజీ చైర్మన్ వసుపతి ప్రణీత శ్రీకాంత్ గౌడ్, జవహర్ నగర్ మాజీ మేయర్ లు దొంతగాని శాంతి కోటేశ్ గౌడ్, మేకల కావ్య, బాలల హక్కుల పరిరక్షణ సమితి సభ్యులు వచన్ కుమార్, గోగుల సరిత, టీ పీ సీ సీ కార్యదర్శి గోగూరి దేవేందర్ రెడ్డి, జవహర్ నగర్ సీఐ సైదయ్య, అడ్మిన్ ఎస్ ఐ ఇద్రిస్ అలీ, మహిళా ఎస్ ఐ బీ మమత, జవహర్ నగర్ మాజీ సర్పంచ్ కారింగుల శంకర్ గౌడ్, డీ ఎస్ ఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఎర్రగుడ్ల వెంకటేశ్వర్, రాష్ట్ర బీసీ సంఘాల జే ఏ సీ చైర్మన్ కుందారం గణేష్ చారి, మాజీ కార్పొరేటర్లు, కౌన్సిలర్లు వివిధ పార్టీల అధ్యక్షులు, ప్రజా సంఘాల నాయకులు పెద్దయెత్తున ప్రజలు పాల్గొన్నారు.

## గంజాయి పట్టుకున్న బెల్లంపల్లి టూ టౌన్ పోలీసులు

**మంచిర్యాల జిల్లా ప్రజాతీర్పు ప్రతినిధి వి వెంకటేష్ జూన్ 21**



మంచిర్యాల జిల్లా: ఉదయం అందజ 10:45 గంటల సమయంలో బెల్లంపల్లి 2 టౌన్ పోలీస్ వారికీ వచ్చిన నమ్మ దగిన సమాచారం మేరకు బల్లర్ష నుండి బెల్లంపల్లికి అక్రమంగా గంజాయిని తరలిస్తున్న %యాని% ముజ్జు %ం /శీ% మైముద్, 28సం//లు, %=/శీ%: కాల్ టెక్స్ ఏరియా, బెల్లంపల్లి అనే వ్యక్తిని కాల్ టెక్స్ ఫ్లైఓవర్ బ్రిడ్జి మీద పట్టుకొని అతని వద్ద నుంచి 26,950 రూ//ల విలువ గల 1 కిలో 78 గ్రాముల ( 1078 %స్త్రతీుఎం% ) గంజాయిని స్వాధీనపర్చుకుని పంచనామా నిర్వహించిన అనంతరం బెల్లంపల్లి 2 టౌన్ పోలీస్ స్టేషన్ కు తీసుకువచ్చి కేసు నమోదు చేసి అనంతరం రిమాండు నిమిత్తం కోర్టు లో హాజరు పరిచడం జరిగినది అని రూరల్ సిఐ అఫ్జలుద్దీన్ బెల్లంపల్లి తెలిపారు



## ఎన్నో రకాల ఒత్తిళ్లకు యోగాతో ఉపశమనం

### వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ శిబిరం

**మంచిర్యాల జిల్లా ప్రజాతీర్పు ప్రతినిధి వి వెంకటేష్ జూన్ 21**

మంచిర్యాల జిల్లా తాండూర్ నిజ జీవితంలో మనిషి ఎన్నో ఒత్తిళ్లకు గురవుతున్నారని యోగాతో వాటి నుంచి ఉపశమనం పొందవచ్చని తాండూర్ మండల విద్యాధికారి ఎస్ మల్లేశం అన్నారు శనివారం వాసవి క్లబ్ తాండూర్ ఆధ్వర్యంలో తంగళ్ళపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఉపాధ్యాయులకు యోగ శిక్షణ శిబిరం ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా హాజరైన వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ వి 107 ఏ జిల్లా కార్పొరేట్ వైస్ చైర్మన్ వాసవియన్ గోల్డెన్ స్టార్ కే సి జి ఎఫ్ కే. సంతోష్ కుమార్ మాట్లాడుతూ యోగా అనేది భారతదేశ ప్రాచీన సాంప్రదాయం ఇది మన శరీరానికి ఆరోగ్యాన్ని మనసుకు ఉత్తేజాన్ని మన ఆత్మకు శుద్ధిని అందించే సాధన అని యోగా ద్వారా మానసిక ఒత్తిడిని దూరం చేసుకోవచ్చని ప్రతిరోజు క్రమం తప్పకుండా యోగా చేయడం ద్వారా ఏలాంటి రోగాల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉంటామని అన్నారు అనంతరం యోగ గురువు చంద్రశేఖర్ కొరకు మొక్క నాటాలని మొక్కను ఇస్తూ ఘనంగా శాలువాతో సన్మానించారు ఈ కార్యక్రమంలో యోగా గురువు చంద్రశేఖర్ వాసవి క్లబ్ తాండూర్ అధ్యక్షులు మైలారపు మధుసూదన్ కోశాధికారి రాచకొండ మహేష్ పూర్వ అధ్యక్షులు కాసం భాస్కర్ పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

## మునిసిపల్ కమిషనర్, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ బాధ్యతలు స్వీకరించిన అధికారులు

- టిఎన్జీవోలు సంఘం తరపున మర్యాద పూర్వక అభినందనలు

**(పడకంటి శ్రీనివాస్, ప్రజాతీర్పు ప్రతినిధి, కరీంనగర్ జూన్ 21)**



కరీంనగర్ మునిసిపల్ కార్పొరేషన్‌కు కొత్తగా నియమితులైన గౌరవనీయులైన శ్రీ ప్రఫుల్ దేశాయ్, %ఌూూ% మునిసిపల్ కమిషనర్‌గా, శ్రీమతి . రంజిత చికిలే (డిప్యూటీ డైరెక్టర్) మునిసిపల్ కార్యాలయంలో ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా తెలంగాణ నాన్‌గెజిటెడ్ ఉద్యోగుల సంఘం (టిఎన్జీవోలు) కరీంనగర్ ఆధ్వర్యంలో నూతన అధికారులను మర్యాద పూర్వకంగా స్థానిక మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కలవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, మునిసిపల్ విభాగాల ఉద్యోగులు పాల్గొన్నారు. నూతన అధికారులకు పుష్పగుచ్ఛాలు అందజేసి, అభినందనలు తెలియజేశారు. ఉద్యోగుల సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలపై భావనలు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ కరీంనగర్ మునిసిపల్ కార్యాలయం నగర అభివృద్ధికి కేంద్రబిందువుగా పని చేస్తోందని, ప్రజలకు నాణ్యమైన మౌలిక సదుపాయాలు అందించడంలో ఈ కార్యాలయ పాత్ర కీలకంగా నిలుస్తోందని, ఈ బాధ్యతల్ని నూతన అధికారులు సత్సంకల్పంతో నిర్వర్తిస్తారని, వారి నాయకత్వంలో మునిసిపల్ పరిపాలన మరింత ముందుకు సాగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయిస్ జేఏసీ కరీంనగర్ జిల్లా చైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి సంగేమ్ లక్ష్మణ్ రావు, టీజీవోలు సంఘం జిల్లా అధ్యక్షుడు మడిపెల్లి కాళీచరణ్, కేంద్ర సంఘం నాయకులు నాగుల నరసింహా స్వామి, సర్దార్ హర్మిందర్ సింగ్, కోశాధికారి కిరణ్ కుమార్ రెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడు ఓంటేల రవీందర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు మారుపాక రాజేష్ భరద్వాజ్, నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కోట రామస్వామి, కార్యదర్శి శంకర్, జిల్లా టీఎన్జీవో నాయకులు సరితా, ఎడ్ల మహేష్, నర్సయ్య, రేవంత్, లవ కుమార్, కరుణాకర్, పవన్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

# రైతు భరోసా పై బి ఆర్ ఎస్ పార్టీ ధర్నా

**పఠాన్ చేరు ప్రజాతీర్పు ప్రతినిధి**



పటాన్చెరు నియోజకవర్గంలోని జిన్నారం మండలంలో అంబేద్కర్ చౌరస్తాలో నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ "రైతు భరోసా" నిధులు వెంటనే విడుదల చేయాలంటూ మహా ధర్నా జిన్నారం గ్రామంలో నిర్వహించబడింది.

ఈ నిరసన ధర్నాకు ముఖ్య అతిథులుగా టిఆర్ఎస్ పార్టీ మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు , జిల్లా ఎమ్మెల్యేలు చింత ప్రభాకర్, కొత్త ప్రభాకర్ రెడ్డి, సునీత లక్ష్మి రెడ్డి, మాణిక్ రావు, డి.సి.ఏం.ఎస్ చైర్మన్ మల్కాపురం శివ కుమార్ మరియు మఠం బిక్షపతి ఈ ధర్నాలో పాల్గొన్నారు

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పటాన్‌చెరు నియోజకవర్గంలోని రామచంద్రపురం, జిన్నారం, పటాన్‌చెరు, అమీన్పూర్ మండలాల్లో కలిపి సుమారు 42,302 ఎకరాల భూమికి రైతులు ఆధారపడుతున్నారు. అయితే ఇప్పటివరకు 27,120 మంది రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ కాకపోవడం వల్ల వేలాది మంది రైతులు ఆర్థికంగా తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం కరోనా వంటి సంక్షోభ సమయంలో కూడా రైతులకు నిధులు నిలిపివేయకుండా అందించిందని, కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను విస్మరించిందని విమర్శించారు. ఆరు గ్యారంటీలు అమలు కాకుండా ఉండటం, రైతులపై తీవ్ర అన్యాయం జరగడం, ఇది "కోతల ప్రభుత్వం" అనే వాస్తవాన్ని నలుదిశలా చాటుతోందని వారు అన్నారు బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు ప్రభుత్వాన్ని గట్టిగా హెచ్చరిస్తూ వెంటనే నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశాయి. రైతులకు తక్షణమే న్యాయం జరగాలని కోరారు అనంతరం ఏం.ఆర్.ఓ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జిన్నారం వెంకటేష్ గౌడ్, పటాన్చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, తెల్లాపూర్ మాజీ సర్పంచ్ సోమిరెడ్డి, జిన్నారం మాజీ జడ్పీటీసీ కొలను బాల్ రెడ్డి, రామచంద్రపురం మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య,గుమ్మడిదల మండలం సీనియర్ బీఆర్ఎస్ నాయకులు గోవర్ధన్ రెడ్డి, తెల్లాపూర్ మాజీ వైస్ చైర్మన్ రాములు గౌడ్,,జిన్నారం మండలం అధ్యక్షుడు రాజేష్,గుమ్మడిదల మండలం అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి,సర్కిల్ అధ్యక్షుడు పరమేష్ యాదవ్,తెల్లాపూర్ మున్సిపాలిటీ అధ్యక్షుడు దేవేందర్ యాదవ్,నియోజవర్గ బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు..

# అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు

- హాజరైన వేలాదిమంది విద్యార్థులు, వివిధ వర్గాల ప్రజలు, అధికారులు, మాజీ ప్రజా ప్రతినిధులు

**పఠాన్ చేరు ప్రజాతీర్పు ప్రతినిధి**



అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని మైత్రి మైదానంలో నిర్వహించిన యోగా దినోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. పటాన్చెరు చరిత్రలోనే మొట్ట మొదటిసారి వేలాదిమందితో కలిసి సామూహిక యోగా కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 6:30 నుండి 09:00 గంటల వరకు పతాంజలి యోగ సమితి శిక్షకుల సౌజన్యంతో రెండున్నర గంటల పాటు వివిధ రకాల యోగా భంగిమలు ప్రదర్శిస్తూ.. ప్రతి ఒక్కరిని భాగస్వాములు అయ్యేలా కార్యక్రమాన్ని నిర్వహించారు. యోగ ప్రాముఖ్యతను తమ ఆసనాల ద్వారా వివరిస్తూ సంపూర్ణమైన ఆరోగ్య జీవనశైలికి యోగ ఏ విధంగా ఉపయోగపడుతుందో వివరించారు.

ఈ సందర్భంగా పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుత పోటీ ప్రపంచంలో మనిషి తన ఆరోగ్యం పై దృష్టి పెట్టకపోవడం మూలంగా మానసిక, శారీరక సమస్యలతో నిరంతరం బాధపడుతూ అనారోగ్యకరమైన జీవితాలను కొనసాగిస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని నియోజకవర్గంలోని ప్రజలకు యోగ ప్రాముఖ్యతను తెలియజేయాలన్న సమున్నత లక్ష్యంతో.. మైత్రి మైదానంలో యోగ దినోత్సవ వేడుకలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. మనిషి నిత్యం ఎదుర్కొనే మానసిక, ఆరోగ్య సమస్యలకు సర్వరోగ నివారిని యోగ అని అన్నారు. యోగాకు కులం మతం ప్రాంతం జాతి లేదని, ప్రతి ఒక్కరి జీవితంలో ఒక భాగమని తెలిపారు. యావత్తు ప్రపంచానికి భారతదేశం అందించిన మహోన్నత సాధనం యోగ అని అన్నారు. ఈ సందర్భంగా పటాన్చెరు సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో మత్తు పదార్థాల వ్యతిరేక అవగాహన వారోత్సవాలను ఎమ్మెల్యే జిఎంఆర్ లాంచనంగా ప్రారంభించారు. విద్యార్థి దశనుండే మత్తు పదార్థాల వినియోగం, వాటి దుష్ఫలితాలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రస్తుత సమాజంలో డ్రగ్స్ కల్చర్ ఎక్కువగా కొనసాగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి పౌరుడు తన బాధ్యతగా డ్రగ్స్ కి వ్యతిరేకంగా పోరాటం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎక్కడైనా ఎవరైనా డ్రగ్స్ వినియోగిస్తే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.



## 112సిఆర్పిఎఫ్ బెటాలియన్ ఆధ్వర్యంలో యోగ డే....

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ప్రజా తీర్పు ప్రతినిధి, సందీప్ జూన్ 21**

అంతర్జాతీయ 11వ యోగ దినోత్సవం పురస్కరించుకొని సీఆర్పీఎఫ్ 112 బెటాలియన్ ఆధ్వర్యంలో ఘనంగా యోగా డే వేడుకలను నిర్వహించారు ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో యువతి యువకులతో పాటు సిఆర్పిఎఫ్ సిబ్బంది పాల్గొని యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా కమాండెంట్ దీపక్ కుమార్ మాట్లాడుతూ భారతీయ ప్రాచీన సంపద యోగాసనమని అన్నారు. మానసిక ఒత్తిడి జయించటం తో పాటు శారీరక బలాన్ని కూడా యోగా అందిస్తుందని అన్నారు. యోగా ద్వారా మనల్ని మనం నియంత్రించుకోవడంతో పాటు మన చుట్టూ ఉన్న సమాజానికి ఏ విధంగా ఉపయోగపడతామో అధ్యయనం చేసుకోవచ్చని స్పష్టం చేశారు. యోగ యొక్క ప్రాధాన్యతను గుర్తించి ప్రపంచ దేశాలే యోగాన్ని గుర్తించాయని విద్యార్థి దశ నుండి వృద్ధాప్యం వరకు ప్రతి ఒక్కరు యోగాసనాలు వేయాలని కోరారు ఈ కార్యక్రమంలో సిఆర్పిఎఫ్ సిబ్బంది స్థానిక పౌరులు యువతీ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## హోప్4స్పందన, నాట్స్ సహకారంతో దివ్యాంగునికి కొత్త జీవితం

### కిరాణా షాపు ఏర్పాటు

**ప్రజాతీర్పు ప్రతినిధి, రామడుగు జూన్ 21**

కరీంనగర్ జిల్లా రామడుగు మండలం పందికుంట పల్లి హామ్లెట్ కురుమపల్లి గ్రామానికి చెందిన దివ్యాంగుడు చిమ్మల్ల శ్రీనివాస్ కు హోప్4స్పందన స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నార్త్ అమెరికా తెలుగు సంఘం (నాట్స్) ఆర్థిక సహకారంతో స్వయం ఉపాధి కిరాణా షాపు ఏర్పాటు చేశారు. సుమారు 11 సంవత్సరాల క్రితం జరిగిన బైక్ ప్రమాదంలో వెన్నెముక దెబ్బతిని శ్రీనివాస్ పూర్తిగా మంచానికి పరిమితమయ్యాడు. భార్య, ఇద్దరు చిన్నారులు, వృద్ధ తల్లిదండ్రులతో కలసి జీవన పోరాటం చేస్తూ నిస్సహాయంగా ఉన్న పరిస్థితిని గుర్తించిన హోప్4స్పందన సంస్థ, రూ.1,70,000 విలువైన ఆర్థిక సహకారం అందించి, ఇందులో రూ.1,00,000 విలువైన షాపు నిర్మాణం, రూ.70,000 విలువైన కిరాణా సరుకులు, ఫ్రిజ్ అందజేసి, శ్రీనివాస్ కు మనోధైర్యాన్ని కలిగించింది. గ్రామస్థాయి దశలో దివ్యాంగుల జీవనోన్నతికి ఈ ప్రయత్నం ఆదర్శంగా నిలుస్తోంది. ఈ షాపును సంస్థ సమన్వయకర్త డాక్టర్ రఘు అరికపూడి, యువజన అవార్డు గ్రహీత గజ్జెల అశోక్, రైజింగ్ సన్ యూత్ క్లబ్ అధ్యక్షులు సంయుక్తంగా ప్రారంభించారు. ఇది సంస్థ స్థాపించిన 116వ స్వయం ఉపాధి షాపు కావడం గమనార్హం. ఈ సందర్భంగా హోప్4స్పందన ఉపాధ్యక్షుడు కోట లక్ష్మీ నరసింహం పర్యవేక్షణలో ఈ సేవా కార్యక్రమాలు జరుగుతున్నాయని, భవిష్యత్‌లో రెండు తెలుగు రాష్ట్రాలలోని వెయ్యి మంది దివ్యాంగులకు స్వయం ఉపాధి కల్పించడం లక్ష్యంగా పనిచేస్తున్నామని డా. రఘు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు మహేష్ దయ్యాల, శ్రీనివాస్ కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## డివిజన్లలో పారిశుధ్య పనులను తనిఖీ చేసి కమీషనర్ ప్రఫుల్ దేశాయ్

**(పడకంటి శ్రీనివాస్, ప్రజాతీర్పు ప్రతినిధి, కరీంనగర్ జూన్ 21)**



పచ్చదనం పారిశుద్యం పై అధికారులు సిబ్బంది ప్రత్యేక దృష్టి పెట్టాలని కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ ఐఏఎస్ అన్నారు. కరీంనగర్ నగరపాలక సంస్థ పారిశుధ్యంలో బాగంగా శనివారం రోజు నగరంలో పర్యటించారు. నగరంలోని పలు డివిజన్లలో పారిశుధ్య పనులను తనిఖీ చేసి పరిశీలించారు. మరో వైపు ఎస్ ఆర్ ఆర్ కళాశాల రిజర్వాయర్ పరిదిలోని నగరపాలక సంస్థ డీఆర్ సీసీ కేంద్రాన్ని సందర్శించారు. డ్రై రీసోర్స్ కలెక్షన్ సంబంధించిన రిజిస్టర్ ను తనిఖీ చేసి పరిశీలించి నిర్వహాకురాలును డ్రై వేస్టు కలెక్షన్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. డ్రై వేస్టు పై పలు సలహాలు సూచనలు చేసి నిర్వహాకురాలు, పారిశుధ్య అధికారులు సిబ్బంది కి ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఎస్ ఆర్ ఆర్ రిజర్వాయర్ ఆవరణలో గల నర్సరీ పరిశీలించారు. నర్సరీలో పెంచుతున్న వివిధ రకాల మొక్కల వివరాలు, వాటి సంఖ్యను అడిగి తెలుసుకొని నర్సరీ నిర్వహాకులు, హరితహారం సిబ్బంది కి ఆదేశాలు జారీ చేశారు. ఈ సంధర్భంగా కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ పారిశుధ్య విభాగం అధికారులు, సిబ్బంది నగరాన్ని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. పరిసర ప్రాంతంలో ఎక్కడ చెత్త కనబడకుండ అధికారులు చర్యలు తీస్కోవాలన్నారు. చెత్త బుట్టల్లో వేరు చేసిన తడి చెత్తను కంపోస్టు కేంద్రాలకు, పొడి చెత్తను డీఆర్ సీసీ కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. డీఆర్ సీసీ సెంటర్ లో డ్రై వేస్టు కలెక్షన్ అనంతరం డంపు యార్డుకు తరలించేలా జవానులు చర్యలు తీస్కోవాలన్నారు. డీఆర్ సీసీ కి ప్రతి స్వచ్ఛ్ ఆటో వచ్చేలా చూడాలని, ప్రతి రోజు డీఆర్ సీసీ వచ్చే డ్రై వేస్టు వివరాల రిపోర్ట్ అందించాలని నిర్వహాకులను ఆదేశించారు. అంతే కాకుండా నర్సరీల్లో పెంచే మొక్కలు ఎండి పోకుండ నర్సరీ సిబ్బంది చర్యలు తీస్కోవాలని కోరారు. నర్సరీలో పెంచే మొక్కల మధ్య కలుపు మొక్కలను తొలగించి సంరక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ స్వామీ, పారిశుధ్య సిబ్బంది, నర్సరీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## యోగాతో సంపూర్ణ ఆరోగ్యం గంజాయి, మత్తుపదర్థాలకు దూరంగా ఉండాలి తాండూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కుమారస్వామి

**మంచిర్యాల జిల్లా ప్రజా తీర్పు ప్రతినిధి శ్రీ వెంకటేష్ జూన్ 21**

రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్ అంబర్ కిశోర్ జా (ఐపీఎస్) , మంచిర్యాల డిసిపి ఏ.భాస్కర్ ఐపీఎస్ గారి ఉత్తర్వుల మేరకు బెల్లంపల్లి ఏసిపి రవికుమార్ పర్యవేక్షణలో తాండూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కుమారస్వామి ఆధ్వర్యంలో మాదారం పోలీస్ స్టేషన్ ఆవరణలోని క్రీడా ప్రాంగణంలో ఎగైనెస్ట్ డ్రగ్ అబ్యూస్ అండ్ ఇల్లిసిట్ ట్రాఫికింగ్ అవేర్నెస్ వీక్ లో భాగంగా శనివారం రోజున ప్రపంచ యోగా దినోత్సవం పురస్కరించుకొని యోగ తో పాటు( నార్కోటిక్ డ్రగ్స్) గంజాయి మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఉదయం సాయంత్రం తీరిక సమయాల్లో యోగా ఆసనాలపై దృష్టి సారించాలని వాటివల్ల మన శరీర అవయవాలు ఎంతో చురుగ్గా పనిచేయడం జరుగుతుందన్నారు. అదేవిధంగా మనం ప్రతి రోజు తీసుకునే ఆహార అలవాట్లలో కూడా మార్పులను చేస్తూ ఆరోగ్యవంతమైన భోజనాన్ని ఎక్కువగా వినియోగించుకునే విధంగా, అలవర్చుకోవాలన్నారు. ప్రతిరోజు ఉదయం అరగంట సేపు నడకతో పాటు వ్యాయామం ,యోగా లాంటి ఆసనాలపై దృష్టి సారిస్తే మన ఆరోగ్యాన్ని మనమే పరిరక్షించుకునేవారమవుతామని తెలిపారు. అదేవిధంగా తాండూర్ సర్కిల్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలో ఈనెల 26 వరకు తమ పోలీస్ సిబ్బంది ఆధ్వర్యంలో గంజాయి మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమాలను కూడా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో తాండూర్ ఎస్సై కిరణ్ కుమార్ మాదారం ఎస్సై సౌజన్య, భీమిని ఎస్ఐ విజయ్ కుమార్ తో పాటు తాండూర్ మండల వాకర్స్ క్లబ్ సభ్యులు ,పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## బెల్లంపల్లి కన్నాల బస్తీలో శక్తి కేంద్ర ప్రముఖ్ బసబోయిన యుగేందర్

**మంచిర్యాల జిల్లా ప్రజా తీర్పు ప్రతినిధి వి వెంకటేష్ జూన్ 21**



మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని కన్నాల బస్తి శక్తి కేంద్ర ప్రముఖ్ బసబోయిన యుగంధర్ గారి పరిధిలోని బూత్ నెం.104 లో బూత్ అధ్యక్షుడు పుల్లె ప్రశాంత్ గారి ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గారి 11,సంవత్సరాల విజయవంతమైన పాలనను పురస్కరించుకుని ఈరోజు శక్తి కేంద్రంలో రచ్చబండ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బెల్లంపల్లి పట్టణ అధ్యక్షులు ధార కళ్యాణి అసెంబ్లీ కన్వీనర్ రాచర్ల సంతోష్ పాల్గొన్నారు. మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది నరేంద్ర మోడీ గారి పరిపాలనలో దేశ అభివృద్ధిని బస్తీ వాస్తవ్యులకి తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో దేశ రక్షణ, ఆర్థికాభివృద్ధి, సామాజిక సంక్షేమం వంటి అంశాలపై కన్నాల బస్తి ప్రజలకు స్పష్టమైన అవగాహన కల్పించడమైంది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అందరూ వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించేందుకు అందరము కలిసి ముందుకు సాగుదాం అని ప్రతిజ్ఞ చేయడం జరిగింది జైహింద్ ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు జనరల్ సెక్రటరీ అరవింద్ కునురాజుల %ాజ% మోర్చా జిల్లా కార్యదర్శికల్లేపల్లి నవీన్ %ాజ% మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యులు ఎరుకల నర్సింగ్,పుల్లరి రాము సీనియర్ నాయకులు వోడ్నాల స్వామి,జీదుల రాములు ఆకుల శంకర్ బస్తీ వాసులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమం వికసిత్ భారత్ ఏ2047 లక్ష్య సాధన దిశగా ప్రజల్లో జాతీయాభిమానం, అభివృద్ధి పై చైతన్యం కలిగించేలా సాగింది

## నేటి నుంచి ప్రారంభమైన రైలు

**మంచిర్యాల జిల్లా ప్రజా తీర్పు ప్రతినిధి వి వెంకటేష్ జూన్ 21**

మంచిర్యాల జిల్లా నేటి నుంచి ప్రారంభమైన రైళ్లు 15 రోజులుగా రద్దయిన పలు రైళ్లు శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. బెల్లంపల్లి-రేచిని రైల్వే స్టేషన్ల మధ్య మూడో లైన్ పనుల కారణంగా ఈ నెల 5 నుంచి 20 వరకు పలు రైళ్ల రాకపోకలు నిలిపివేశారు. కాగా నేటి నుంచి పుష్ పుల్, రామగిరి, బల్లార్షా ఎక్స్ప్రెస్, సిర్పూర్ కాగజ్నగర్ రైళ్లు యథావిధిగా రాకపోకలు సాగించనున్నాయి. ఈ 15 రోజులు భాగ్యనగర్ (17233/34), ఇంటర్ సిటీ (17011/12) మంచిర్యాల వరకు రాకపోకలు సాగించాయి.



## ఎల్లారెడ్డిపేట పోటీలో అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమం

### యోగ తనే ప్రతి మనిషికి సంపూర్ణ ఆరోగ్యం సీఐ శ్రీనివాస్ గౌడ్

**ప్రజా తీర్పు ప్రతినిధి సిరిసిల్ల స్టాపర్,జూన్ 21**

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట జడ్పిహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాలలో స్థానిక సీఐ శ్రీనివాస్ గౌడ్, ఎస్ఐ రమాకాంత్, పాఠశాల ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు, పత్రికా విలేకరులు కలిసి యోగ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలు రకాల యోగ ఆసనాలు వేసి పండ్ల పంపిణీ చేశారు. అనంతరం సిఐ మాట్లాడుతూ ప్రతి మనిషికి ఉదయం లేవగానే 30 నిమిషాలు యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ప్రతి ఒక్కరికి తెలిపారు. మనిషి మానసిక శరీరక ప్రశాంతతకు ఆరోగ్యానికి యోగం ఎంతగానో దోహదపడుతుందన్నారు. యోగ నిత్యం చేయడం వల్ల మానసిక ఒత్తిడిలు, గుండెపోటు, పక్షవాతం, జీర్ణ వ్యవస్థ, మనిషి ఎదుగుదల, వంటి పలు రకాల యోగ వల్ల ఆరోగ్య మెరుగుపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, ఇంటర్,డిగ్రీ విద్యార్థులు, పాఠశాల విద్యార్థులు, పత్రికా పాత్రికేయులు పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం.



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ప్రజా తీర్పు ప్రతినిధి, సందీప్ జూన్ 21**

11 వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా భద్రాచలం ఏరియా హాస్పిటల్ నందు డాక్టర్ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా యోగ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేశ్వరరావు ప్రసంగిస్తూ ఒత్తిడిని జయించడానికి, సానుకూల దృక్పథాన్ని కొనసాగించడానికి యోగా ఒక సాధనంగా ఉపయోగపడుతుందని, యోగా చేయడం వల్ల చిన్నపిల్లల నుండి వృద్ధుల వరకు ఆరోగ్యరిత్యా మరియు మానసికంగా ఎటువంటి ఒత్తిడి లేకుండా ఆరోగ్యంగా ఉండొచ్చు అని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కైలాష్ మోహన్, డాక్టర్ సంతోష్, డాక్టర్ జగదీష్ మరియు స్టాఫ్ నర్సులు ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు మరియు ఆయుష్ సిబ్బంది పాల్గొని యోగ అభ్యసనాలు చేశారు.

# క్లోరోహైడ్రేడ్ భారీగా పట్టివేత

- 425 కేజీలకు క్లోరోహైడ్రేడ్ స్వాధీనం
- కేజీ ఆల్ఫా జోలం సీజ్
- రెండు కార్లను, ఐదుగురు వ్యక్తులను అరెస్ట్.

**నిర్మల్ జిల్లా ప్రతినిధి,జూన్21(ప్రజాతీర్పు):**

ఈత చెట్లు ఒట్టి మొద్దులయ్యాయి.. ఈత కల్లు బంగారం అయ్యింది.. మందు కలిపిన కల్లు తాగిన కళ్ళకు నిండుశులయ్యాయి అన్నట్లుగా...నేడు కల్లు మండువాల్లోనూ కళ్ళు దుకాణాల్లో కల్తీకల్లు రాజ్యమేలుతుంది. తాడి ఈత చెట్లు ఎక్కడం.. గీయడం.. లాంటి మరిచిన గౌడ్ అన్నలు అల్ఫా జోలం, క్లోరోహైడ్రేడ్ లాంటి విష పదార్థాలతో కల్తీకల్లును తయారుచేసి అమ్మకాలు జరుపుతూ ప్రజల ప్రాణాలతో జలగాటమాడుతున్నారు. కల్తీ కల్లు తయారుకు వినియోగించే క్లోరోహైడ్రేడ్ తయారీ యూనిట్ ను శనివారం ఎక్సైజ్ స్టేట్ టాస్క్ ఫోర్స్, ఎక్సైజ్ సిబ్బంది కలిసి తయారీ యూనిట్ ని పట్టుకున్నారు.ఈ యూనిట్లో తయారైన 425 కేజీల క్లోరోహైడ్రేడ్ ను స్వాధీనం చేసుకున్నారు. మరో అడుగు ముందుకు వేసినఈ ప్రత్యేక టీములు వారి వద్ద గుప్తంగా దాచిపెట్టిన రూ. 10 లక్షల విలువ చేసే ఒక కేజీ ఆల్ఫా జోలమును రెండు కార్లను నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి తమ సత్తా చాటుకున్నారు.



**వివరాల్లోకి వెళ్తే..**

నిర్మల్ టు బైంసా రహదారిలో చిట్యాల ప్రాంతంలో ఒక మారుమూల ప్రాంతంగా ఉన్నటువంటి వ్యవసాయ క్షేత్రంలో నిర్మాణం చేపట్టిన గృహంలో క్లోరోహైడ్రేడ్ తయారి యూనిట్ ను ఏర్పాటు చేశారు.బుర్ర రమేష్ గౌడ్, రామా గౌడ్ లనే ఇద్దరు వ్యక్తులు కలిసి ఈ యూనిట్ ని ఏర్పాటు చేశారు. ఈ యూనిట్ తయారీ వద్ద శ్రీనివాస్ గౌడ్,రాజశేఖర్ గౌడ్, రాజు గౌడ్ అనే ముగ్గురిని వ్యక్తులు కూడా అక్కడే ఉండి తయారీని పర్యవేక్షిస్తున్నారు. ముంబైలోని భీమండి ప్రాంతంలో క్లోరో అనే ద్రవపదార్థాన్ని తీసుకువచ్చి 50 లీటర్లకు తొమ్మిది లీటర్ల నీరును కలిపి డ్రంబుల్లో పోసి గుంతలు తవ్వి చుట్టూ ఐస్ గడ్డలను ఏర్పాటు చేసి సుమారు పది రోజులపాటు అనంతరం గడ్డ కట్టిన తర్వాత దాన్ని క్లోరోహైడ్రేడ్ గా తయారుచేసి కల్తీ కళ్ళు విక్రయానికి వినియోగిస్తున్నట్లు నిందితులు విచారణలో అంగీకరించారు. నలుగురు వ్యక్తులతో పాటు ఐదు సెల్ ఫోన్ లను 17 క్లోరోహైడ్రేడ్ బ్యాగులను కేజీ ఆల్ఫాజోలం ను, రెండు కార్లను స్వాధీనం చేసుకొని నలుగురుని అరెస్ట్ చేసినట్లు ఎస్ టి ఎఫ్ బి టీం లీడర్ ప్రదీప్ రావు తెలిపారు. ఈ దాడిలో టీజీ న్యాబ్ నుంచి రూపేష్ ఐపిఎస్,సిఐ రమేష్, పూర్ణేశ్వర్ ,నిర్మల్ సిఐ రంగస్వామి ఎస్ టి ఎఫ్ బి టీం ఎస్సై బాలరాజు నితిన్ కౌశిక్ లతో పాటు పాలూరు సిబ్బంది ఈ దాడిలో పాల్గొన్నారు. పట్టుకున్న 425 కేజీల క్లోరోహైడ్రేడ్ విలువ రూ. 10 లక్షలు, రూ. 10 లక్షల విలువ చేసే ఆల్ఫా జోలం 15 లక్షల విలువ చేసే రెండు కార్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్టిఎఫ్ పోలీసులు పేర్కొన్నారు. కల్తీ కళ్ళు తయారీలో వినియోగించే క్లోరోహైడ్రేడ్ యూనిట్ ని పట్టుకున్నందుకు అండ్ ఫోర్స్ ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం అభినందించారు.



## అల్ఫోర్స్ లో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు

**కొత్తపల్లి (హెచ్), కరీంనగర్**

యోగా అందరికి అవసరమని మరియు యోగా ద్వారా సుఖవంతమైన జీవితాన్ని గడపవచ్చని తద్వారా రోజు వారి కార్యకలాపాలను ఎటువంటి ఆటంకాలు లేకుండా చేసుకోగలగుతామని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా? వి. నరేందర్ రెడ్డి గారు స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా వేడుకగా నిర్వహించినటువంటి యోగా దినోత్సవ్ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యోగా అనేది పురాతన శాస్త్రమని మరియు ఈ శాస్త్రం ద్వారా సమాజంలో ప్రతిఒక్కరికి లాభాలు చేకూరుతాయని కాని దీనిని ప్రతి ఒక్కరు సరియైన పద్ధతిలో యోగా శాస్త్రంలో తెలుపబడినటువంటి నియమావళిని పాటించినట్లైతే ఎటువంటి వైద్య సలహాలు అవసరముండదని అభిప్రాయడుతూ మన భారతదేశంలో ఆవిర్భవించినటువంటి ఈ యోగా శాస్త్రానికి చాలా ప్రాముఖ్యత ఉన్నదని, దీనిని మన దేశంలోనే కాకుండ ఇతర దేశాలలో సైతం ఒక గొప్ప ప్రక్రియగా పరిగనిస్తున్నారని తెలిపారు. యోగా అనేది రోజువారి కార్యక్రమంలా రూపొందిచుకోవాలని మరియు క్రమం తప్పకుండా సాదన చేసేవారికి ఆరోగ్యకరమైన జీవితం లభిస్తుందని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదని చెప్పారు. 5000 సం॥ల క్రితం నాటి యోగా శాస్త్రం ఋగ్వేదలో స్పష్టంగా రూపొందించబడినదని మరియు వాటిలోని సూత్రాలను పాటించినట్లైతే ఎటువంటి కార్యక్రమానైన చాలా సులభంగా చేయగలుగుతామని చెప్పారు. భారతదేశంలో అమలు చేస్తున్న ఈ యోగా సాదన ప్రపంచంలోని అన్ని దేశాల వారు అమలు చేస్తున్నారని మరియు ఆరోగ్యంగా ఉండగలుగుతున్నారని పలు నివేదికల ద్వారా స్పష్టంగా తెలుస్తున్నదని తెలిపారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో ఈ వేడుకలను చాలా గొప్పగా ఆదర్శనీయంగా నిర్వహించడం ఒక ఆనవాయితి అని ఆ ఆనవాయితిని ఈ సం? సైతం రెట్టింపు ఉత్సాహంతో నిర్వహించడం చాలా హర్షదాయకమని తెలిపారు. ఉత్సవాలలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించినటువంటి పలు ఆసనాలు, ప్రాణయామం ఆసనాలు చాలా ఆకర్షనీయంగా నిలిచాయి. ముఖ్యంగా చిన్నారులు ప్రదర్శించినటువంటి పలు నృత్యాలు నాటికలు నూతన ఉత్సాహాన్ని నింపాయి. చివరగా ప్రతి ఒక్కరు యోగను మర్చిపోవద్దని యోగా మూలాలను ఎప్పటికప్పుడు సాధన చేస్తు అందరికంటే అగ్రగామిగా ఉండి సమాజ హితానికి తోడ్పాటును అందించాలని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు. ఇట్లు డా॥ వి. నరేందర్ రెడ్డి ఛైర్మన్.



## అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జగిత్యాలలో భవ్యంగా యోగా కార్యక్రమం

**జగిత్యాల:**

21 జూన్ 2025, అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని జగిత్యాల జిల్లా కేంద్రంలోని వివేకానంద మినీ స్టేడియంలో యోగా కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శ్రీ బి. సత్యప్రసాద్ గారు పాల్గొని ఇతరులతో కలిసి యోగా ఆసనాలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ %–% "యోగాను జీవనశైలిలో భాగంగా చేసుకోవడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకోవచ్చు. పౌరులు అందరూ ప్రతిరోజూ కనీసం కొన్ని నిమిషాలు యోగా చేయాలని కోరుతున్నాను" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీవో మధుసూదన్ మరియు జిల్లా అధికారులు, విద్యార్థులు, వివిధ విభాగాల ఉద్యోగులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జిల్లా %ాఁఖూ॥% శాఖ, స్పోర్ట్స్ అథారిటీ సహకారంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.



## బీజేపీ నెక్కొండ మండల వికసిత్ భారత్ మండల సంకల్ప సభ

**నెక్కొండ జూన్ 21 (ప్రజా తీర్పు)**

భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ఏర్పడి దేశ ప్రధాని నరేంద్ర మోడీ11 సంవత్సరాల సేవా – సుపరిపాలన పూర్తి చేసుకున్న సందర్భంగా బిజెపి ప్రభుత్వం తీసుకున్న చారిత్రాత్మకమైన నిర్ణయాలను ప్రభుత్వ పథకాలను ప్రజలకు తెలియజేసేలా నెక్కొండ మండల కేంద్రంలో మండల అధ్యక్షులు నాయిని అనూష అశోక్ అధ్యక్షతన నిర్వహించిన రచ్చబండ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా బీజేపీ వరంగల్ జిల్లా ప్రధానకార్యదర్శి,నర్సంపేట నియోజకవర్గ నాయకులు డా॥ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాణా ప్రతాప్ రెడ్డి మాట్లడుతూ. భారత ప్రధాని నరేంద్ర మోడీ అధికారం చేపట్టి 11 సంవత్సరాలు వికసిత్ భారత్ అమృతకాలం సేవా – పరిపాలన, సుపరిపాలన సందర్భంగా దేశ ప్రధాని తీసుకున్నటువంటి చారిత్రాత్మకమైన నిర్ణయాలను పథకాలను ప్రజలకు చేరవేసే విధంగా రచ్చబండ కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు విస్తృత ప్రచారం చేస్తూ,అదేవిధంగా రాబోయే స్థానిక ఎలక్షన్లకు సిద్ధంగా ఉండాలి ప్రతి బూత్ అధ్యక్షులు ఒక సైనికుడి గా పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలి. కేంద్రంలో మోడీ ప్రభుత్వం ఏర్పడి 11 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మోడీ ప్రభుత్వం డిజిటల్ ట్రాన్సాక్షన్ లో 100 శాతం అధిగమించి. భారత ప్రభుత్వం 40శాతం సంకల్పం సాధించిందని చెప్పారు. మోడీ ప్రభుత్వం 80 శాతం ప్రజలకు ప్రతి వ్యక్తికి 5 కేజీల బియ్యం చొప్పున ఆహార భద్రత కార్డు కలిగిన ప్రజలందరికీ ఉచితంగా అందిస్తుందన్నారు. 370 ఆర్టికల్ భారతదేశంలో అంతర్భాగం అని దీనిని ఎవరు విడదీయరన్నారు. అయోధ్య రామ మందిరం పూర్తి చేయడంలో ప్రధానమంత్రి మోడీ కృషి అమోఘం అన్నారు. ఆపరేషన్ సింధూర్ ద్వారా ఉగ్రవాదాన్ని నలిపివేశారని ఇది మోడీ ప్రభుత్వం ఘనత అన్నారు. 2014 నుండి 2024 వరకు రైతులకు బిజెపి ప్రభుత్వం చేపట్టి న ఎం॥స్పి ద్వారా రైతులు రెట్టింపు ఆదాయం పొందారని పేర్కొన్నారు. పిఎం కిసాన్ ద్వారా దేశంలో 12 కోట్ల రైతులకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శులు రాంపల్లి రాజగోపాల్ గడ్డల సతీష్ కార్యదర్శులు కొయ్యాడా అనిల్ సూత్రపు శ్రీనివాస్ మండల సీనియర్ నాయకులు మాజీ అధ్యక్షులు సింగారపు సురేష్ తాళ్లూరి లక్ష్మయ్య అంబాల రామ్ గోపాల్ మాజీ సర్పంచ్ పింగిలి మోహన్ రెడ్డి బోళ్ల శ్రీనివాస్ యాదవ్ పసునూటిఅశోక్ నీలం ఏలేందర్ గుగులోతు నరేష్ సూరిపల్లి శీను కుడికాల సుధీర్ బోళ్ల రంజిత్ దాసరి శ్రీనివాస్ గుగులోత్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు

# రైతు భరోసా పై బి ఆర్ ఎస్ పార్టీ ధర్నా





**పఠాన్ చేరు ప్రజాతీర్పు ప్రతినిధి**

పటాన్చెరు నియోజకవర్గంలోని జిన్నారం మండలంలో అంబేద్కర్ చౌరస్తాలో నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ "రైతు భరోసా" నిధులు వెంటనే విడుదల చేయాలంటూ మహా ధర్నా జిన్నారం గ్రామంలో నిర్వహించబడింది.

ఈ నిరసన ధర్నాకు ముఖ్య అతిథులుగా టిఆర్ఎస్ పార్టీ మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు , జిల్లా ఎమ్మెల్యేలు చింత ప్రభాకర్, కొత్త ప్రభాకర్ రెడ్డి, సునీత లక్ష్మి రెడ్డి, మాణిక్ రావు, డి.సి.ఏం.ఎస్ చైర్మన్ మల్కాపురం శివ కుమార్ మరియు మఠం బిక్షపతి ఈ ధర్నాలో పాల్గొన్నారు

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పటాన్‌చెరు నియోజకవర్గంలోని రామచంద్రపురం, జిన్నారం, పటాన్‌చెరు, అమీన్పూర్ మండలాల్లో కలిపి సుమారు 42,302 ఎకరాల భూమికి రైతులు ఆధారపడుతున్నారు. అయితే ఇప్పటివరకు 27,120 మంది రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ కాకపోవడం వల్ల వేలాది మంది రైతులు ఆర్థికంగా తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం కరోనా వంటి సంక్షోభ సమయంలో కూడా రైతులకు నిధులు నిలిపివేయకుండా అందించిందని, కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను విస్మరించిందని



విమర్శించారు. ఆరు గ్యారంటీలు అమలు కాకుండా ఉండటం, రైతులపై తీవ్ర అన్యాయం జరగడం, ఇది "కోతల ప్రభుత్వం" అనే వాస్తవాన్ని నలుదిశలా చాటుతోందని వారు అన్నారు బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు ప్రభుత్వాన్ని గట్టిగా హెచ్చరిస్తూ వెంటనే నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశాయి. రైతులకు తక్షణమే న్యాయం జరగాలని కోరారు అనంతరం ఏం.ఆర్.ఓ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జిన్నారం వెంకటేష్ గౌడ్, పటాన్చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, తెల్లాపూర్ మాజీ



సర్పంచ్ సోమిరెడ్డి, జిన్నారం మాజీ జడ్పీటీసీ కొలను బాల్ రెడ్డి, రామచంద్రపురం మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య,గుమ్మడిదల మండలం సీనియర్ బీఆర్ఎస్ నాయకులు గోవర్ధన్ రెడ్డి, తెల్లాపూర్ మాజీ వైస్ చైర్మన్ రాములు గౌడ్,,జిన్నారం మండలం అధ్యక్షుడు రాజేష్,గుమ్మడిదల మండలం అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి,సర్కిల్ అధ్యక్షుడు పరమేష్ యాదవ్,తెల్లాపూర్ మున్సిపాలిటీ అధ్యక్షుడు దేవేందర్ యాదవ్,నియోజవర్గ బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు..

## గిరిజనుల అభివృద్ధి లక్ష్యంగా కేంద్ర పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

**ఖానాపురం జూన్ 21(ప్రజాతీర్పు)**



గిరిజనుల జీవన నాణ్యతను మెరుగు పరచడం లక్ష్యంగా ధర్తి ఆబాజం జాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ పథకంను కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తుందని వరంగల్ జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి, ఖానాపురం మండల ప్రత్యేక అధికారి సౌజన్య తెలిపారు. ఖానాపురం మండలంలోని భద్రుతండా , బోటీమీదితండాలలో ధర్తి ఆబాజం జాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ పథకం, ప్రధానమంత్రి జన జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ పై అవగాహన సదస్సు జరిగింది. ఈసందర్భంగా సౌజన్య మాట్లాడుతూ భారత దేశ సామాజిక ఆర్థిక ప్రధాన స్రవంతిలోకి అనుసంధానించడానికి, గిరిజనుల ఆదాయ ఉత్పత్తి ,ఆర్థిక సాధికారత కోసం ప్రధానమంత్రి నరేంద్రమోడి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని విమర్శించారు. గిరిజనుల సంక్షేమం కోసం కేంద్రం అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కల్పించడానికే గిరిజన గ్రామాలలో సదస్సులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జన జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ కింద ఆధార్ కార్డు నమోదు ,రేషన్ కార్డు ,నివాస ,కుల దృవీకరణ పత్రాలు ,పిఎం మాతృవందనయోజన ,మిషన్ ఇంద్రధనుష్ ,ముద్రయోజన ,కిసాన్ క్రెడిట్ కార్డు ఆయుష్మాన్ భారత్ ,టిబి ముక్త అభియాన్ ,పిఎం జన్ ధన్ యోజన ,పీఎం విశ్వకర్మ యోజన, పిఎం కిసాన్ తదితర అంశాలపై గిరిజనులకు అవగాహన కల్పించారు. ఈసమావేశానికి ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు కె.శ్యామల ,ఏ.రవి అధ్యక్షతన వహించగా,ఖానాపురం తహశీల్దార్ నంగునూరు రమేష్ , ఎంపీడీవో సునీల్ కుమార్ , మెడికల్ ఆఫీసర్ జ్యోతి ,పశు వైద్య అధికారి శ్రీలక్ష్మి ,వింధ్య ,డిటిడీఓ ఎస్ ఆర్ పి తెజావత్ గంగయ్య , వ్యవసాయ అధికారి శ్రీనివాస్ , ఐసిడిఎస్ అధికారులు, బ్యాంకు అధికారులు,మాజీ సర్పంచ్ లు మాజీ ఎంపిటీసీలు,గిరిజన ప్రజలు పాల్గొన్నారు.



## తెలంగాణ ఉద్యమకారుడు గుండెబోయిన కొమురయ్య ను పరామర్శించిన బి ఆర్ ఎస్ నాయకులు..

**నర్సంపేట జూన్ 21(ప్రజా తీర్పు)**

పట్టణంలోని 11వ వార్డు స్థానికులు బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అభిమాని గుండెబోయిన కొము రయ్య వయసు రీత్యా అనారోగ్యంతో బాధప డుతుండగా వారి బాగోగులను కుమారుడు 11వ వార్డు బిఆర్ఎస్ అధ్యక్షుడు గుండెబోయిన శివకోటి, కుటుంబ సభ్యులను అడిగి తెలుసు కున్నారు పట్టణ అధ్యక్షులు నాగెల్లి వెంకట నారాయణ గౌడ్,స్థానిక మాజీ కౌన్సిలర్ మండల శ్రీనివాస్ పట్టణ ప్రధాన కార్యదర్శి వేనుముద్దల శ్రీధర్ రెడ్డి,బిఆర్టీయు జిల్లా అధ్యక్షులు గోనె యువరాజ్ మాజీ కౌన్సిలర్స్ నాగిశెట్టి ప్రసాద్, రాయరాకుల సారంగం, అప్పల సుదర్శన్ కొల్లూరి లక్ష్మీనారాయణ, మునీశ్వర్, బీరం నాగిరెడ్డి, నాయిని వేణు చంద్, సంపంగి సాలయ్య, పెరు మాండ్ల రవి తదితర పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర ఉద్యమ స్ఫూర్తి ప్రదాత వ్యూహ కర్త ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి వేడుకలు..



**శేరిలింగంపల్లి, ప్రజాతీర్పు**

ఆరు దశాబ్దాల తెలంగాణ ఉద్యమ చుక్కాని, తెలంగాణ వాదాన్ని ప్రపంచానికి చాటిన మహోజ్ఞాని, తెలంగాణ సిద్ధాంతకర్త, ఉద్యమ స్ఫూర్తి ప్రదాత ఆచార్య కొత్తపల్లి జయశంకర్ వర్ధంతి సందర్భంగా వారి సేవలను స్మరించుకుంటూ శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ ఖాజాగూడ లోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం నందు 21/06/ 2025 శనివారం రోజున ఘన నివాళులు అర్పిం చిన శేరిలింగంపల్లి సీనియర్ నాయకులు మరియు గచ్చి బౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయి బాబా. ఈ కార్యక్రమంలో అంజమ్మ,మాధవి, దార్గు పల్లి నరేష్,నారాయణ, రమేష్ గౌడ్, నరేష్ సింగ్, అలీం, తాహెర్, బురాన్ పాల్గొనడం జరిగింది.

## సదిశ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాఠశాలకు వాటర్ ప్యూరిఫైయర్ కోసం నగదు అందజేత

**ప్రజాతీర్పు ప్రతినిధి, రామడుగు జూన్ 21**



రామడుగు మండలం గోపాలరావుపేట గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థుల మంచినీటి అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని సదిశ ఫౌండేషన్ డైరెక్టర్ శ్రీ నవీన్ రెడ్డి సహకారంతో పాఠశాలకు వాటర్ ప్యూరిఫైయర్ కోసం 10వేల రూపాయలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయ బృందం సమక్షంలో అధికారికంగా అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు నవీన్ రెడ్డితో పాటు సదిశ ఫౌండేషన్ వాలంటీర్ బృందానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ విధమైన మానవతా కార్యక్రమాలు మరింత ప్రోత్సాహించాలని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సదిశ ఫౌండేషన్ వాలంటీర్లు ద్యావ నవీన్ రెడ్డి, పున్న కనకయ్య, గంగివేని శ్రీనివాస్, వేముల కృష్ణ, రేణిగుంట శ్రీనివాస్, ఏపూరి ప్రశాంత్ లు పాల్గొన్నారు.

## నిత్యానరకంగా మారిన హాఫీజ్ పేట్ - చందా నగర్ మంజీర పైప్ లైన్ రోడ్డువిస్తరణ పనులు.. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కోరుతూ భాజాపా ఆధ్వర్యంలో నిరసన పాదయాత్ర.

**శేరిలింగంపల్లి, ప్రజాతీర్పు**

ఊసరవెల్లి లాగా పార్టీలు మారుతూ ప్రజా సమస్యలు పట్టించుకోని ఎమ్మెల్యే అరకపూడి గాంధీ స్థానిక కార్పొరేటర్ వెంటనే రాజీనామా చేయాలి.. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంటెస్టెడ్ ఎమ్మెల్యే రవికుమార్ యాదవ్.. నిత్యం నరకయాతన పడుతూ వేలాది మంది వాహనదారులు ఉద్యోగాలకు వెళ్లాలన్నా, బయటకు వెళ్లి వ్యాపారం చేసుకోవాలన్న చదువుకునే విద్యార్థులు పాఠశాలలకు వెళ్లాలన్నా రోడ్ల పరిస్థితి బాగు లేక నిత్యం నరకం చూస్తున్నారని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్ నాయకత్వంలో ,హాఫీజ్ పేట్ డివిజన్ బీజేపీ కాంటెస్టెడ్ కార్పొరేటర్ అనూష మహేష్ యాదవ్ సమక్షంలో, డివిజన్ అధ్యక్షులు జితేందర్ అధ్యక్షతన శనివారం రోజు మంజీరా రోడ్డు నుండి చందానగర్ మున్సిపల్ కార్యాలయం వరకు ప్రజా సమస్యలపై భారీ ఎత్తున పాదయాత్ర నిర్వహించారు. నిధులు మంజూరై సంవత్సరాలు గడుస్తున్నా నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తూ, వేసవికాలం మొత్తం విశ్రాంతి తీసుకుని బాధ్యతారహితంగా వ్యవహరిస్తూ అధికారుల నిర్లక్ష్యం ,ప్రజా ప్రతినిధులు అలసత్వం వలన శనివారం రోజు శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వారి సమస్యలను భారతీయ



జనతా పార్టీ భుజాలపై వేసుకొని సమస్యల పరిష్కార దిశగా ప్రజా పోరాటం చేస్తున్నామని కంటెస్టెడ్ ఎమ్మెల్యే రవికుమార్ యాదవ్ తెలిపారు. వర్షాకాలం నెత్తిమీదికి వచ్చిన సమయంలో అధికారులు ఇప్పుడు మత్తు నిద్ర వదిలి ఎక్కడ రోడ్డు అక్కడ ఇష్టారాజ్యంగా తవ్వి వదిలేసి ప్రజల రాకపోకలకు ఇబ్బంది కల్పిస్తూ రాక్షసానందం పొందుతున్నారు, తస్మా జాగ్రత్త ప్రజలను ఇబ్బంది పెడితే వదిలే ప్రసక్తే లేదని అధికారులను, ప్రజా ప్రతినిధులను హెచ్చరిస్తూ ,నిలిచిపోయిన రోడ్ల మరమ్మత్తు పనులను వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ కి రోడ్ల సమస్యలపై వినతి పత్రం రాసి జిహెచ్ఎంసి కార్యాలయానికి వెళ్లి అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, నియోజకవర్గ కన్వీనర్ ,కో-కన్వీనర్, రాష్ట్ర జిల్లా డివిజన్ మాజీ– నూతన అధ్యక్షులు, మహిళా మోర్చా, యువ మోర్చా, వివిధ కాలనీ ఆదిత్య అపార్ట్మెంట్స్, వినాయక నగర్, ప్రకాష్ నగర్, ఏపీ ఎన్జీవో కాలనీ, సాయిరాం టవర్స్, వైశాలి నగర్, ఆల్విన్ కాలనీ ,మైత్రి నగర్ ,మదీనాగూడ , కల్కి హైట్స్ , ఆర్టీసీ కాలనీ, మై హోమ్ జెవెల్, ఇంజనీరింగ్ ఎంక్లేవ్, హుడా కాలనీ, గంగారం మొదలగు కాలనీవాసులు ఈ నిరసన కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## 24న హైదరాబాద్ లో జరుగు ఆర్టీసీ బీసీ సంఘం రాష్ట్ర మహాసభను జయప్రదం చేయండి

**జనగాం డిపోలో పోస్టర్ ఆవిష్కరణలో వరంగల్ రీజినల్ అధ్యక్షుడు గొలనకొండ వేణు పిలుపు**

**జనగాం జిల్లా, జూన్21, ( ప్రజా తీర్పు ):**

ఈనెల జూన్ 24 మంగళవారం న హైదరాబాదులో జరుగు 8వ, రాష్ట్ర మహాసభను జయప్రదం చేయవలసిందిగా ఆర్టీసీ బీసీ సంక్షేమ సంఘం వరంగల్ రీజినల్ అధ్యక్షుడు గొలనకొండ వేణు పిలుపునిచ్చారు. శనివారం ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సంఘం 8వ రాష్ట్ర మహాసభ పోస్టర్లను డిపో ప్రెసిడెంట్ ఆర్.లింగం రాష్ట్ర ఉపాధ్యక్షులు దుర్గయ్య, బాలరాజు, వేమన, ఆంజనేయులు సతీష్, మధు, శ్రీను, రమేష్ డిపో నాయకులతో పాటు ముఖ్య అతిథులుగా జనగాం డిపో గౌరవ అధ్యక్షులు, జనగాం జిల్లా వ్యవసాయ మార్కెట్ చైర్మన్ బనక శివరాజ్ యాదవ్ లతో సంయుక్తంగా కలిసి పోస్టర్లను ఆవిష్కరణ చేశారు. బీసీ హక్కుల సాధన కోసమై ఆర్టీసీ పరిరక్షణకై జరిగే ఈ మహాసభను విజయవంతం చేయాలని శివరాజ్ యాదవ్, దుర్గయ్య, గొలనకొండ వేణు, ఆర్. లింగం ఆర్టీసీ బీసీ ఉద్యోగులకు పిలుపునిచ్చారు.




## అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శ్రీనిధి స్కూల్ ఆఫ్ ఎక్సలెన్సీ లో యోగా అవగాహన సదస్సు..

**శేరిలింగంపల్లి, ప్రజాతీర్పు**

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కొండాపూర్ బి బ్లాక్ లో గల శ్రీనిధి స్కూల్ ఆఫ్ ఎక్సలెన్సీ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు సుధా ఆధ్వర్యంలో ప్రముఖ బ్యాడ్మింటన్ ప్లేయర్ పీ.వీ సింధు యోగా శిక్షకులు రాజు సమక్షంలో విద్యార్థి,విద్యార్థినులకు యోగా యొక్క ప్రాధాన్యతను , ఆరోగ్యంవంతంగా ఉండడానికి ప్రతి రోజూ యోగా చేయడం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. అలాగే పిల్లల చేత యోగాసనాలు వేయించి వాటి వల్ల కలిగే మానవాళి కి కలిగే లాభాలను సవివరంగా తెలియజేశారు. స్కూలు యాజమాన్యం యోగా శిక్షకుడు రాజు ను సత్కరించి ధన్యవాదములు తెలిపారు.

# విద్యారంగ సమస్యల పరిష్కారం కై ఉద్యమిద్దాం

**మంచిర్యాల జిల్లా ప్రజా తీర్పు ప్రతినిధి వి వెంకటేష్ జూన్ 21**



అల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్( ఐసా) తెలంగాణ రాష్ట్ర కమిటీ సమావేశం స్థానిక మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని %యూxయూ% కార్యాలయంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా అల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు అల్లి సాగర్ మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమై నేటికి వారం రోజులు కావస్తున్న తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలలో, కళాశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పూర్తిస్థాయి మౌలిక సదుపాయాలు కల్పించడంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం రోజే ఇవ్వవలసిన పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, బట్టలు పూర్తిస్థాయిలో ఇవ్వలేకపోయారన్నారు. మరియు పాఠ శాలల్లో కళాశాలలో మరుగుదొడ్లు టాయిలెట్లు, మంచినీటి వసతి, ఫ్యాన్లు,ట్యూబ్ లు, ఫర్నిచర్ సదు పాయాలు కల్పించలేకపోయారు అన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో నర్సరీ, ఎల్కేజీ, యూకేజీ విద్యా ప్రారంభిస్తున్నాం అని ప్రకటించిన ముఖ్యమంత్రి మాటలు కేవలం నీటి మీది రాతలు గానే మిగిలాయి తప్ప ఆచరణకు నోచుకోలేక పోతున్నాయన్నారు. పూర్తిస్థాయిలో ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేసి మెరుగైన విద్యను అందించవలసిన పాలకులు ప్రభుత్వ విద్యను నీరుగార్చుతున్నారన్నారు. ఒకవైపు ప్రభుత్వ విద్యారంగాన్ని పూర్తిగా నీరుగార్చుతూ, మరోపక్క ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు విచ్చలవిడిగా అనుమతులు ఇస్తూ ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలను పెంచి పోషిస్తున్నారు అన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో, కళాశాలల్లో ఇష్టారాజ్యంగా అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యను వ్యాపారమయం చేసి, వ్యాపారం చేస్తున్న విద్యాశాఖ అధికారులు, ప్రభుత్వం పట్టించుకోకుండా వారికి వత్తాసు,పలుకుతున్నారన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలో, కళాశాలలో ఎలాంటి మౌలిక సదుపాయాలు లేకపోయినా, అర్హత కలిగిన ఉపాధ్యాయులు లెక్చరర్లు లేకపోయినా కనీసం వారి విద్యా అర్హతలు కూడా విద్యాధికారులు తెలుసుకోకుండా ప్రైవేట్ విద్యా వ్యాపారానికి రెడ్ కార్పేట్ వేసి సహకరిస్తున్నారన్నారు. రాష్ట్రంలో విద్య అంగడి సరుకుగా మారిందన్నారు. సేవా దృక్పథంతో ఉండవలసిన విద్య నేడు వ్యాపార దృక్పథంతో కొనసాగుతుందన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో, కళాశాలలో ఇష్టారాజ్యంగా టై, బెల్టు, షూస్, డ్రెస్, పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ అనీ, అడ్మిషన్ ఫీజులని, డొనేషన్స్ ఫీజులు అనీ, ట్యూషన్ ఫీజులని, బస్ ఫీజులు అనీ, స్లిప్ టెస్ట్ ఫీజులు అని, టెస్టులకు పేపర్ ఖర్చులు అని, కర్ క్యూలం ఫీజలు అనీ, ఆటవస్తువులకని, ఫుడ్ ఫీజ్ అని, బెడ్ ఫీజ్ అని ఇలా ఒకటేమిటి ఎన్నో రకాల ఫీజుల పేర్లు చెప్పి పిల్లల తల్లిదండ్రులను మానసికంగా వేధిస్తూ ఆర్థికంగా దోపిడీ చేస్తున్నారన్నారు. పిల్లల ఫీజులు చెల్లించుకోవడం కోసం భూములు, ఆస్తులు అమ్ముకొని, ఫైనాన్సుల్లో అప్పులు తీసుకొని చెల్లిస్తున్నారన్నారు. ఈ విధంగా పిల్లల తల్లిదండ్రులను అప్పుల పాలు చేస్తూ ఆర్థిక దోపిడీకి పాల్పడుతున్నారు ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల యజమాన్యాలు. ఇవన్నీ తెలిసిన విద్యాధికారులు, ప్రభుత్వం చోద్యం చూస్తూ ఉంది అన్నారు. అంతేకాకుండా ప్రైవేట్ రంగంలో కార్పొరేట్ రంగంలో విద్యను సెక్షన్ల వారిగా, స్పార్క్ బ్యాచిలని, స్పెషల్ బ్యాచిలని ఇలా విభజించి బోధన చేస్తున్నారు. ఇప్పటికే విద్య మొత్తం పేద, మధ్యతరగతి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ప్రజలకు అందని ద్రాక్షగా మారిందన్నారు. కాబట్టి అందరికీ విద్య అందాలంటే పోరాటం ఒకటే మార్గమని పిలుపునిచ్చారు. అందరికీ సమాన విద్య అవకాశాలు అందాలన్నారు. దాని కోసమై పి డి ఎస్ యు రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున విద్యార్థి ఉద్యమాలు బలోపేతం చేయాలని, విద్యార్థులతో మమేకమై విద్యార్థి లోకాన్ని చైతన్యం చేసి బలమైన విద్యార్థి ఉద్యమాలు నిర్మించి విద్యార్థుల హక్కులను సాధించాలన్నారు. దానికి పోరాటం ఒక్కటే ఏకైక మార్గమని పిలుపునిచ్చారు. అందుకే విద్యార్థులను పోరుమార్గం పట్టించాలన్నారు. ప్రభుత్వం విద్యాధికారుల మెడలు వంచి విద్యారంగ సమస్యలు పరిష్కరించుకుందాం అని పిలుపునిచ్చారు.

1) ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించుకుందాం..

2) విద్యా ప్రవేటికరణను, కార్పొరేటికరణను, కాషాయికరణను, వ్యాపారీకరణను పూర్తిగా వ్యతిరేకిద్దాం.. పోరాటాలు నిర్వహిద్దాం..

3) ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలో, కళాశాలలో ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలి.

4) అధిక ఫీజుల దోపిడీకి వ్యతిరేకంగా పోరాడుదాం..

5) కామన్ ఫీజు విధానానికై పోరాడుదాం..

6) కామన్ విద్యావిధానానికై ఉద్యమిద్దాం..

7) గుర్తింపు లేనటువంటి ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలను వెంటనే మూసివేయాలి..

8) విద్యారంగా సమస్యల పరిష్కారం కై రాష్ట్రవ్యాప్త విద్యార్థి పోరుబాట పడదాం.. ఈ సమావేశంలో అల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు రాజు, అన్నమయ్య, ప్రశాంత్ క్రాంతి, శేఖర్, ఆదిత్య, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## నూతన బస్సు సర్వీస్ లను ప్రారంభించిన నర్సంపేట డిపో మేనేజర్ ప్రసూన లక్ష్మీ




**నర్సంపేట జూన్ 21(ప్రజా తీర్పు)**

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నర్సంపేట డిపో నుండి ప్రయాణికుల సౌకర్యం కొరకు కేసముద్రం, నెల్లికుదురు –తొర్రూర్, దబ్బీర్ పేట గ్రామాలకు పల్లెవెలుగు సర్వీస్ లు నర్సంపేట నుండి హన్మకొండకి ఉదయం 05.45, 7.00గంటలకుమొదటి ట్రిప్పు నుండి ప్రతీ గంట పదిహేను నిమిషాలకు ఒక డీలక్స్ బస్సు సర్వీస్ ను నడుపనున్నట్లు డిపో మేనేజర్ ప్రసూన లక్ష్మీ తెలిపారు. ఈ సదావకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**వివరాలు**

నర్సంపేట బస్టాండ్ నుండి ఉదయం 6.45, సాయంత్రం 4.00గంటలకు ఎల్లాయిగూడెం, గుండెంగ, నాగారం నుండి కేసముద్రం వరకు, ఉదయం 07.30,12.15, సాయంత్రం 04.15కి నర్సంపేట నుండి ఇనుగుర్తి, నెల్లికుదురు నుండి తొర్రూర్ కి,నర్సంపేట నుండి ఉదయం 7.15సాయంత్రం 05.15కి అశోక్ నగర్, దబ్బీర్ పేట గ్రామాలకు పల్లె వెలుగుసర్వీస్. నర్సంపేట నుండి హన్మకొండకి ఉదయం 5.45,7.00గంటల నుండి డీలక్స్ సర్వీస్ ప్రతీ గంట పదిహేను నిమిషాలకు నడుపబడును. అని తెలిపారు







## బాలీవుడ్ మాకు అవసరం.. అంతే కానీ అదే మా లైఫ్ కాదు అంటున్న హీరోయిన్స్

డబ్బు నాకు అవసరం అప్పా.. అలవాటు కాదు అంటూ జల్సాలో త్రివిక్రమ్ ఓ డైలాగ్ రాసారు గుర్తుందా..? ఇప్పుడు మన హీరోయిన్లకు ఈ మాట సరిగ్గా సరిపోతుంది. బాలీవుడ్ అనేది అవసరమే కానీ అలవాటు కాదంటున్నారు వాళ్లు. అకేషనల్‌గా ఓకే గానీ అక్కడే సెటిల్ అయిపోవాలనే తొందరేం లేదంటున్నారు. అందుకే హిందీలో భారీ బ్రేక్స్ ఇస్తున్నారు సౌత్ హీరోయిన్లు. డబ్బు నాకు అవసరం అప్పా.. అలవాటు కాదు అంటూ జల్సాలో త్రివిక్రమ్ ఓ డైలాగ్ రాసారు గుర్తుందా..? ఇప్పుడు మన హీరోయిన్లకు ఈ మాట సరిగ్గా సరిపోతుంది. బాలీవుడ్ అనేది అవసరమే కానీ అలవాటు కాదంటున్నారు వాళ్లు. అకేషనల్‌గా ఓకే గానీ అక్కడే సెటిల్ అయిపోవాలనే తొందరేం లేదంటున్నారు. అందుకే హిందీలో భారీ బ్రేక్స్ ఇస్తున్నారు సౌత్ హీరోయిన్లు. ఏమాటకామాటే.. ఒకప్పుడు బాలీవుడ్‌లో నటించాలని మన హీరోయిన్లు చూపించిన ఆ క్యూరియాసిటీ ఇప్పుడు వాళ్లలో కనిపించట్లేదు. తెలుగులో నటిస్తే చాలు.. ఇండియా అంతా ఏలేయొచ్చు అనే కాన్ఫిడెన్స్ కనిపిస్తుంది వాళ్లలో..! అందుకే హిందీలో అవకాశం వస్తే ఓకే కానీ అక్కడే సెటిల్ అయిపోవాలనే ఆశలైతే మన బ్యూటీస్‌లో ఏ కోశానా కనిపించట్లేదు. కావాలంటే కీర్తి సురేష్‌నే తీసుకోండి.. బేబీ జాన్ వచ్చి 6 నెలలు దాటినా ఇప్పటికీ రెండో హిందీ సినిమా సైన్ చేయలేదు. ఈ మధ్యలో చాలా ఆఫర్స్ వచ్చినా ఎందుకో గానీ కీర్తి అటు వైపు పెద్దగా ఆసక్తి చూపించట్లేదు. జవాన్ తర్వాత నయనతార కూడా మరో హిందీ సినిమా చేయలేదు. త్రిష సైతం 2010లో వచ్చిన కట్టా మీటా తర్వాత బాలీవుడ్ వైపు చూడలేదు.



## అలా అనుకుంటే విజయం ఖాయం

తన ఇన్‌స్టా ద్వారా అభిమానులకు నాలుగు మంచి మాటలు చెబుతూ ఉంటారు అగ్ర కథానాయిక సమంత. రీసెంట్‌గా తన ఇన్‌స్టా ద్వారా అభిమానులకు ఓ విలువైన సందేశాన్ని పంపారామె. 'ఇతరుల మాటలు పట్టించుకొని ప్రశాంతతను పాడు చేసుకోవద్దు. 'ఏదైతే అది కానీ' అనే ధోరణితో ఉంటే ప్రశాంతత లభించదు. పాజిటివ్‌గా ఆలోచిస్తేనే ప్రశాంతత. దానికి సాధన అవసరం. 'నేను చేయాల్సింది..' అనే మాటను 'నేను తప్పకుండా చేసి తీరాల్సిందే..' అనే విధంగా మార్చుకుంటే విజయం మన వెంటే ఉంటుంది. ఆత్మ సంఘర్షణ ఆరోగ్యానికి మంచిది కాదు. మనసు వేగంతో కాదు.. నిశ్చలత్వంతోనే ప్రశాంతంగా ఉంటుంది. మానసిక ఒత్తిళ్లు మన గౌరవానికి అవరోధం కాకూడదు.' అంటూ రాసుకొచ్చింది సమంత.

Edited Printed Published and Owned by SOYINENI MAHESH, **RNI Reg no. APTEL/2001/5268** printed at m/s Ganesh Printers Ramantapur Hyderabad, Published at m/s Bavani Publication Trust Plot No C-1/2c idl Uppal hydrabad-500039 Chieff Editor : S.Mahesh, 94946 59622, office : 8309979541, Admn office: 1-7-334 2nd floor Musherabad Hydrabad -500020